

మలమూత్ర విసర్జనలో ఆకస్మిక మార్పు రావడం
- అసాధారణమైన రక్త స్రావం

క్యాన్సర్ నిర్ధారణకు చేసే పరీక్షలు
- రక్తకణ పరీక్ష, ఎక్స్‌రే, స్కానింగ్
- ఇండైరెక్ట్ లారింగోస్కోపి
- మమ్మోగ్రఫీ, పాప్‌స్మియర్ పరీక్ష (స్త్రీలకు)
- పి.ఎస్.ఎ. పరీక్ష (పురుషులకు)

చికిత్సావిధానం

చికిత్సా విధానంలో అనేక మార్పులు వచ్చాయి. సాధారణంగా క్యాన్సర్ స్వభావాన్ని బట్టి ఆపరేషన్, కీమోథెరపీ (మందుల ద్వారా చికిత్స), రేడియేషన్ (ఎలక్ట్రాన్, ప్రోటాన్స్, ఎక్స్ కిరణాలు) పద్ధతిలో చికిత్స చేస్తారు. రోగి పరిస్థితిని బట్టి హార్మోన్లను ఉపయోగించడం, బోన్‌మారో (మూలగ) ట్రాన్స్‌ప్లాంటేషన్ చేస్తారు. మన రాష్ట్రంలో కొత్తగా కోబాల్ట్ ట్రీట్‌మెంట్ పరికరాలు వచ్చాయి. దీని ద్వారా క్యాన్సర్ చికిత్స సులభమైందని ఎం.ఎన్.జె క్యాన్సర్ హాస్పిటల్ డైరెక్టర్ బి.యన్.రావు తెలిపారు. క్యాన్సర్ రోగుల చికిత్సకు ప్రభుత్వం కొంత డబ్బు సహాయం చేస్తోందని, ఆ మొత్తాన్ని ఇంకా పెంచాలని, అలాగే డబ్బు రావడంలో జాప్యం జరుగుతోందని, అది త్వరగా వచ్చేట్లు చూడాలని ఆయన అన్నారు. క్యాన్సర్ పరిశోధనకు దేశంలో అవకాశాలు తక్కువగా ఉన్నాయని, దాన్ని మెరుగు పరచాలని అన్నారు.

ప్రభుత్వం పెట్టిన యూజర్ ఛార్జీలు తమకు ఇబ్బందిగా మారాయని ఎం.ఎన్.జె. క్యాన్సర్ ఆసుపత్రిలో చికిత్సకు వచ్చిన రోగులు తెలిపారు. ప్రయివేట్ ఆసుపత్రుల్లో డబ్బు చెల్లించలేక ఇంతదూరం వస్తే ఇక్కడ యూజర్ ఛార్జీలు తమకు భారంగా మారాయని కృష్ణా జిల్లా నుండి వచ్చిన క్యాన్సర్ బాధితుడు తెలిపారు. దూర ప్రాంతం నుండి వచ్చిన తమకు ఇక్కడ సరైన సౌర్యాలు లేవని తెలిపారు. దీనిపై డైరెక్టర్ వివరణ యిస్తూ సాధ్యమైన సౌకర్యాలు కల్పిస్తున్నామని, యూజర్ ఛార్జీలు ప్రభుత్వ నిర్ణయమని తెలిపారు.

కొన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో క్యాన్సర్‌తో వస్తే రోగుల జేబులు ఖాళీ అవుతున్నాయి. ప్రజల్లో క్యాన్సర్ అంటే ఒక విధమైన భయం ఉండటంతో డాక్టర్లు చెప్పినంత ఫీజు చెల్లించి చికిత్స చేయించుకుంటున్నారు. వారు రాసిన పరీక్షలు వారి అనుబంధ డయాగ్నోస్టిక్ సెంటర్లలోనే చేయించుకోవాలనడంతో రోగులు అధిక మొత్తం వెచ్చించాల్సి వస్తోంది. కొందరు



డాక్టర్లు అవసరమున్నా లేకున్నా అనేక రకాల పరీక్షలు చేయించుకోమని సూచిస్తున్నారు. అటు సర్కారు దవాఖానాల్లో సౌకర్యాలు లేక, ఇటు ప్రయివేట్ వైద్యశాలల్లో డబ్బు చెల్లించలేక రోగులు కష్టాల పాలవుతున్నారు.

నివారణ - జాగ్రత్తలు

- పొగాకు, నశ్యం, గుట్కాలు, పాన్ మసాలా వంటి అలవాట్లకు దూరంగా వుండటం
- మత్తు పదార్థాలు, మద్యం సేవించకుండా వుండటం
- మసాలా కలిపిన వేపుడు పదార్థాలను, కొవ్వు పదార్థాలను తక్కువగా తినడం
- పీచు పదార్థాలు గల తాజా కూరగాయలు, ఫలాలు తినడం
- స్థూల కాయం తగ్గించుకోవడం, క్రమం తప్పకుండా యోగా, వ్యాయామం చేయడం
- 35 ఏళ్లు దాటిన వారు క్రమం తప్పకుండా క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవడం

క్యాన్సర్‌ను పూర్తిగా నివారించడం సాధ్యమేనని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. క్యాన్సర్‌తో వచ్చిన రోగి అలవాట్లు, నివాస పరిసరాల గురించి వివరాలు తీసుకొని ఏడాది తర్వాత మొత్తం వివరాలు పరిశీలిస్తే ఏ ప్రాంతాల్లో దేని వలన క్యాన్సర్ వస్తోందో తెలుసుకోవచ్చు. ఆ పరిసరాలు, అలవాట్లలో మార్పు తేవడం ద్వారా నివారించవచ్చని డాక్టర్లు తెలిపారు.

(క్యాన్సర్ చికిత్స నిపుణులు డా॥ లక్ష్మణరావు, డాక్టర్ కల్పనా రఘునాథ్, డాక్టర్ బి.ఎన్.రావు అభిప్రాయాల ఆధారంగా రాసిన వ్యాసం)



☆ గర్భిణులు సాధారణంగా బరువు పెరుగుతారు. డెలివరీ తర్వాత బరువు తగ్గకపోతే తీసుకోవాల్సిన జాగ్రత్తలేమిటి ?

కొవ్వు పదార్థాలు తక్కువగా తీసుకోవాలి. పళ్ల రసాలు, ఆకుకూరలు తీసుకోవచ్చు. పాలిచ్చే తల్లులు డైటింగ్ చేయడం మంచిది కాదు. వ్యాయామం చేయడం ఆరంభించాలి. ఈ సమయంలో నడక మంచి వ్యాయామం. కాబట్టి రోజుకి అరగంట సేపైనా అటు ఇటు నడవాలి. డాక్టరు చెప్తే తప్ప బెడ్‌రెస్ట్ తీసుకోవడం అనవసరం. బరువు తగ్గాలనే విషయం గుర్తు చేసుకుంటూ ఉండాలి. కాఫీ, టీలు తగ్గించాలి.

☆ ప్రారంభ దశలో రుతుక్రమం ఎలా ఉంటుంది ?

సాధారణంగా ఆడపిల్లల్లో నెలసరి (బహిష్టు) 11 నుండి 15 సంవత్సరాల మధ్య మొదలవుతుంది. ప్రారంభదశలో కొంతమందిలో బహిష్టు ప్రతి నెల రాకుండా రెండు మూడు నెలలకు ఒకసారి ఒక క్రమం లేకుండా రావచ్చు. దీనివలన భయపడవలసిన అవసరం లేదు. అయితే అలా వచ్చినపుడు రక్తస్రావం నాలుగు, అయిదు రోజులతో ఆగకుండా ఎక్కువ రోజులు అయిన ఎడల తగిన జాగ్రత్త తీసుకొనవలెను. బహిష్టు సమయంలో కడుపునొప్పి, నడుం నొప్పి, కాళ్ల నొప్పులు ఉండటం సహజం. దాని గురించి అనవసరంగా భయపడకూడదు. పిల్లలను స్కూలు మాన్పించి ఇంట్లో ఉంచకూడదు. చిన్న వయస్సులో పెళ్లి చెయ్యడం వలన ఎన్నో అనర్థాలు కలుగుతాయి. సంసారిక జీవితం గురించి సరైన అవగాహన లేకపోవడం, తమ శరీర నిర్మాణం గురించి తెలియకపోవడం వలన సంసార జీవితంలో సుఖం, ఆనందం కరువవుతుంది.

డా॥ కె.జయప్రదాదేవి
గైనకాలజిస్ట్, విజయవాడ

అంపశయ్య నవీన్

మనందరిలోనూ దేవదాసు ఉన్నాడు

"వారం రోజులుగా మీరు ఊర్లో లేనట్టున్నారు!" అంటూ వచ్చాడు మా పక్కింటి పుల్లారావు.

"అవును హైదరాబాద్‌లో హైదరాబాద్ ఫిల్మ్ క్లబ్ అనే ఓ సంస్థ 'దేవదాసు చలనచిత్రోత్సవం' అనే ఓ మంచి కార్యక్రమం నిర్వహిస్తే ఆ కార్యక్రమానికి అటెండ్ అవడానికి హైదరాబాద్ వెళ్ళొచ్చాను" అన్నాను ఆయనను ఇంట్లోకి ఆహ్వానిస్తూ.

"దేవదాసు చలనచిత్రోత్సవం ఏమిటండి బాబోయ్! సత్యజిత్‌రే చలనచిత్రోత్సవమనో, గురుదత్ చలనచిత్రోత్సవమనో, శాంతారాం చలనచిత్రోత్సవమనో చెప్పుకోవడం విన్నానుగానీ దేవదాసు చలనచిత్రోత్సవం మనం ఎప్పుడూ విన్లేదే. ఈ దేవదాసు ఏమన్నా సినిమా దర్శకుడా? ఆయనేమన్నా సినిమాలు తీశాడా? వరసగా ఆయన తీసిన సినిమాలన్నీ చూపించారా? అన్నాడు పుల్లారావు మా డ్రాయింగ్ రూంలో ఉన్న ఓ సోఫామీద కూర్చుంటూ.

"మీ సందేహం నిజమే. దేవదాసు సినిమా దర్శకుడు కాదు. ఆయన సినిమాలు తీయలేదు. అసలు దేవదాసు అనేవాడు నిజంగా ఈ ప్రపంచంలో లేడు - అదో కల్పిత పాత్ర - శరత్‌బాబు అనే ఓ నవలా రచయిత సృష్టించిన పాత్ర. కానీ ఈ దేవదాసు అనే వాడు మన దేశ ప్రజల సామూహిక చైతన్యంలో ఒక అంతర్భాగంగా మారిపోయాడు. మనలోని చాలా మందిలో ఈ దేవదాసు అనే వాడుంటాడు. అందుకే ఈ నవలను ఆధారం చేసుకొని మన దేశంలోని వివిధ భాషల్లో మొత్తం 18 సినిమాలు నిర్మించబడ్డాయంటే చాలా ఆశ్చర్యం కలుగుతుంది. నిన్నగాక మొన్ననే సంజయ్‌లీలా బన్సాలి అనే ఓ ముంబాయి దర్శకుడు యాభై కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి షారూఖ్‌ఖాన్, మాధురీదీక్షిత్, ఐశ్వర్యారాయ్ లాంటి పాపులర్ స్టార్స్‌తో దేవదాసు సినిమాను మరోసారి నిర్మించాడు. ప్రేక్షకులు దేవదాసునెందుకంతగా ఇష్టపడ్డారంటారు? మెజారిటీ ఆఫ్ ప్రేక్షకుల మనస్తత్వం దేవదాసు మనస్తత్వానికి చాలా దగ్గరగా ఉంటుంది. అందుకే ప్రేక్షకులు చాలా సులభంగా దేవదాసులో తమను తాము చూసుకోగలుగుతున్నారు. అలాంటి 'తాదాత్మ్యం' ఉండటం వల్లనే ఓ నవలను గానీ, సినిమాను గానీ లేక మరే ఇతర కళా ప్రక్రియను గానీ ప్రజలు ఇష్టపడ్తారు. కేవలం సందేశం కోసమో, ఆదర్శం కోసమో ప్రజలు కళల్ని ఆదరించరు. తమను తాము ఆ కళలో దర్శించుకోగలిగినప్పుడే ఏ కళా ప్రక్రియైనా సార్థకతను పొందగలుగుతుంది. మీరు దేవదాసును పిరికివాడన్నారు. మీరేకాదు చాలా మంది అతన్ని పిరికివాడనే అంటారు. ఆ మాటకొస్తే మనం కూడా పిరికివాళ్ళమే. మనలో ఎంతమంది మనల్ని కనీ, పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రుల్ని ధిక్కరించి, ఎదిరించి నిలబడగలుగుతామంటారు? తల్లిదండ్రులంటే మన సమాజానికి ప్రతినిధులు... తల్లిదండ్రుల్ని ఎదిరించి, వాళ్ళను కష్టపెట్టిన వాళ్ళను సమాజం క్షమించదు - దేవదాసుకు పార్వతంటే ఇష్టమే... ఈ ఇష్టమే ప్రేమ అనీ, ప్రేమించుకున్న వాళ్ళు తప్పకుండా పెళ్ళి చేసుకోవాలని పార్వతి ఓ అర్ధరాత్రి అతనింటికొచ్చి 'నీకాళ్ళ దగ్గర నాకింత చోటివ్వు దేవదా!' అని అడిగేదాకా అతనికి తెలియనే తెలీదు.... ఆమెను ఆనందపరచడానికి "రేపు మా నాన్నతో మాట్లాడతానంటాడు. వాళ్ళ నాన్న ఎట్టి పరిస్థితుల్లోనూ నువ్వు పార్వతిని పెళ్ళి చేసుకోవడానికి వీల్లేదంటాడు. మనం జమీందారులం... వాళ్ళు మామూలు మధ్యతరగతి కుటుంబీకులు... పైగా పార్వతి పూర్వులు ఆడపిల్లల్ని అమ్ముకునేవాళ్ళట! అలాంటి అమ్మాయిని నువ్వుచేసుకుంటే నేను చస్తానంటాడు దేవదాసు వాళ్ళ

నాన్న. అటువంటప్పుడు దేవదాసు ఏం చేస్తాడు? తండ్రిని ఎదిరించే సాహసం అతనికి లేదు... ఏం చెయ్యాలో తోచక అతడు కలకత్తా వెళ్ళిపోయి నన్ను మరచిపో పార్వతీ అని పార్వతికి ఉత్తరం రాస్తాడు. దేవదాసు తనకలాంటి ఉత్తరం రాస్తాడని పార్వతి ఊహించలేదు. ఆ ఉత్తరం ఆమె అహాన్ని బాగా దెబ్బతీస్తుంది. ఈలోగా పార్వతికి వేరే అతనితో పెళ్ళి నిర్ణయమై పోయింది. పార్వతి తనది కాకుండా పోతున్నదని తెలిసినప్పుడే దేవదాసుకు తను పార్వతిని ఎంతగా ప్రేమిస్తున్నాడో తెలుస్తుంది - తాను చేసిన తప్పు తెలుసుకొని కలకత్తా నుండి వాళ్ళూరొచ్చి పార్వతిని కలుసుకొని 'మనం పెళ్ళి చేసుకుందాం పారూ!' అంటాడు. అప్పుడు పార్వతి ఒప్పుకుంటే కథ సుఖాంతమై పోయేది. కాని ఇక్కడ పార్వతికి దేవదాసు మాటను ఒప్పుకోవడానికి ఆమె స్వాభిమానం అడ్డొస్తుంది." నీకేకాదు నాకూ నాన్న ఉన్నాడంటుంది. మా నాన్న నా పెళ్ళిని వేరేవాళ్ళతో నిర్ణయించాడు. ఆయన మాటను కాదని నిన్ను పెళ్ళి చేసుకోలేనంటుంది. ఇలా దేవదాసు, పార్వతిల మనస్తత్వాలే వాళ్ళ వివాదానికి కారణమవుతాయి. వాళ్ళిద్దరూ విడిపోయాకగానీ వాళ్ళకర్థం కాదు.. ఒకరంటే ఒకరికి ఎంత బలీయమైన అనుబంధం ఉందో.. ఇలా చాలా మందిలో ఉండే తల్లిదండ్రుల మీది గౌరవం, స్వాభిమానం, విడిపోతే తప్ప ఇద్దరి మధ్య ఏర్పడిన అనుబంధం ఎంత బలీయమైందో తెలియకపోవడం లాంటి మానవీయ అంశాలన్నీ దేవదాసులో ఉన్నాయి... అలానే సమాజం దృష్టిలో పతితులుగా చిత్రించబడిన వాళ్ళల్లో ఎంతమానవత్వం ఉంటుందో చంద్రముఖి పాత్ర ద్వారా మనం తెలుసుకుంటాం. చంద్రముఖి ఓ వేశ్య. ఆమె దేవదాసును ప్రేమిస్తుంది. పతనమైపోతున్న దేవదాసును కాపాడాలనుకుంటుంది. మొదట్లో దేవదాసు ఆమెను అసహ్యించుకున్నా తర్వాత తన పట్ల ఆమెకేర్పడిన ఆరాధనను అర్థం చేసుకుంటాడు - ఆమెనుండి విడిపోతూ "నిన్ను ప్రేమిస్తున్నాను" అని చెప్తాడు. దేవదాసు, పార్వతి, చంద్రముఖి లాంటి మనందరిలో ఉండే వివిధ మానసిక ప్రవృత్తుల్ని ప్రతిబింబించే సజీవ పాత్రల వల్లనే దేవదాసు ఇంత ప్రాచుర్యాన్ని పొందింది. ఇక తాగడం అంటారూ.. దేవదాసు వాస్తవంలోంచి పారిపోవడానికి ఈ తాగడం అనేదొక గొప్ప సాధనంగా కనిపించింది. అనుక్షణం పార్వతిని గూర్చి ఆలోచిస్తూ అనుభవించే మానసిక హింసకన్నా ఈ తాగుడే నయమనిపించింది. తాను దేవదాసును కాదని వేరే అతన్ని పెళ్ళి చేసుకోవడం వల్ల దేవదాసిలా తాగుడుకు బానిసయిపోయి జీవితాన్ని నాశనం చేసుకుంటాడని పార్వతి కూడా ఊహించలేదు. అతన్ని బాగు చేసి దార్లో పెట్టడానికి పార్వతి ప్రయత్నిస్తుంది. కానీ అప్పటికే చాలా ఆలస్యమైపోయింది. తాగుడు విషయంలో అతడు తిరిగి వెనక్కి రాలేనంత దూరంవెళ్ళిపోయాడు. తనదగ్గరి కొస్తే అతన్ని బాగు చేసుకోవచ్చుననే ఉద్దేశంతోనే అతన్ని తన దగ్గరకు రమ్మంటుంది. తప్పకుండా వస్తానని మాటిస్తాడు. ఆ మాట నిలుపుకోవడం కోసమే తనకిక ఎక్కువ రోజులు లేవని తెలుసుకున్న దేవదాసు చివరి క్షణంలోనైనా పార్వతి దగ్గరకు వెళ్ళాలని, ఆమెకిచ్చిన మాట నిలుపుకోవాలని ప్రయత్నిస్తాడు. ప్రతి మనిషి జీవితం వాళ్ళ మనస్తత్వం మీదనే ఆధారపడుతుంది. మన మనస్తత్వంలోని కొన్ని బలహీనతలే - వాటినే ఇంగ్లీషులో "ఫేటల్ ఫ్లాస్" అంటారు. మన జీవితాల్ని నిర్ణయిస్తాయి - దేవదాసు ద్వారా మనం తెలుసుకోవాల్సిందేమిటంటే : దేవదాసులాంటి వాళ్ళను అర్థం చేసుకోవడం మనలోని బలహీనతల్ని జయించడానికి ప్రయత్నించడం" అన్నాన్నేను. "నిజమే" అంటూ పుల్లారావు లేచి వెళ్ళిపోయాడు. ✤

...చుక్కలు కలపండి



తీరిక లేదు



నసీరుద్దీన్ ఇంటి పక్కనే ఉండే వ్యక్తి ఒక రోజు ఇంటికి వచ్చాడు.

'నాకొక ఉత్తరం రాసిపెడతారా' అని అడిగాడు.

'ఎవరికి రాయాలి' అని అడిగాడు నసీరుద్దీన్.

'నా మిత్రునికి రాయాలి. అతను బాగ్దాద్‌లో ఉన్నాడు' అన్నాడా వ్యక్తి.

'క్షమించండి. ఇప్పుడ్లో బాగ్దాద్ వెళ్లడం నాకు కుదరదు' అన్నాడు నసీరుద్దీన్.

ఆ వ్యక్తి ఆశ్చర్యపోయాడు. 'అసలు మిమ్మల్ని బాగ్దాద్ ఎవరు వెళ్ళమన్నారు. నేనడిగింది లెటర్ రాయమని కదా' అన్నాడా వ్యక్తి అయోమయంగా.

'ఆ విషయం నాకు అర్థమైంది. కానీ నా చేతిరాత అంత బాగుండదు. నేను రాసిన లెటర్ అక్కడి వారెవ్వరూ చదవలేరు. నీ మిత్రుడు ఇక్కడికి వచ్చి మళ్లీ నాతోనే చదివించుకోవాల్సి ఉంటుంది. లేదా నేనయినా అక్కడికి వెళ్ళి చదివి వినిపించాలి. చెప్పాను కదా ఇప్పుడు నాకు బాగ్దాద్ వెళ్ళేంత తీరిక లేదు' అని తన పనిలో మునిగిపోయాడు నసీరుద్దీన్.

క్విజ్-23

1. 'గాలివాన' కథా రచయిత ఎవరు?
ఎ. పాలగుమ్మి పద్మరాజు బి. దాశరథి

2. ఆంధ్రప్రదేశ్ హితకారిణి సమాజాన్ని స్థాపించింది ఎవరు?
ఎ. గురజాడ బి. వీరేశలింగం

3. రూపాయి నోటుపై ఎవరి సంతకం ఉంటుంది?
ఎ. ఆర్థికమంత్రి బి. ఆర్థిక మంత్రిత్వశాఖ కార్యదర్శి

4. మహాభారతానికి మరో పేరు?
ఎ. జయసంహిత బి. జయచంద్రిక

5. ఓజోన్‌లో ఉండే ఏకైక మూలకం ఏది?
ఎ. కార్బన్ డై ఆక్సైడ్ బి. ఆక్సిజన్

6. స్కర్వీ అను వ్యాధి దేని లోపం వలన వస్తుంది?
ఎ. సి విటమిన్ బి. కె విటమిన్

7. 'స్పేస్ సిటీ' అని ఏ నగరానికి పేరు?
ఎ. ముంబయి బి. బెంగుళూరు

8. మన ఉప రాష్ట్రపతి ఎవరు?
ఎ. షెకావత్ బి. షిండే

9. ఇటీవల సామాజిక సేవారంగంలో మెగసెసే అవార్డు అందుకున్న వ్యక్తి ఎవరు?
ఎ. అన్నాహజారే బి. సందీప్‌పాండే

10. పక్క ఫొటోలోని వ్యక్తి ఎవరు?
ఎ. సద్దాం హుస్సేన్ బి. ప్రమోద్ మహాజన్

ఆహ్వానం

బాలలూ,

బాలనేస్తాల శీర్షికలో వివిధ అంశాలు ఇస్తున్న విషయం తెలిసిందే. చాలా మంది నేస్తాలు తమ ఐటమ్స్ పంపుతున్నారు. అయితే వాటిల్లో ఎక్కువగా సేకరించినవే ఉంటున్నాయి. మీరు బాగా చదవడంతో పాటు రచనలు కూడా చేయడం ప్రారంభించాలి. చిన్న చిన్న కథలు, వ్యాసాలు, జోకులు స్వయంగా ఆలోచించి రాసి పంపించండి. మీ ఐడియా బాగుండి మీకు సరిగా రాయడం కుదరకపోయినా వాటిని తీర్చిదిద్ది ప్రచురిస్తాం. అయితే ఆలోచనలన్నీ కొత్తగా, మీ స్వంతంగా ఉండాలి.. కమాన్ రడీ.

–ఎడిటర్

గతవారం జవాబులు

క్విజ్-22: 1. కొలంబస్ 2. ఫొటోమీటర్ 3. ఆక్యుపంక్చర్ 4. 42 5. రాజారామ్మోహన్‌రాయ్ 6. కారల్ మార్క్స్ 7. పాళి 8. పెసో 9. ఎఐటియుసి 10. లింగ్డో

8-9-02 సంచిక పజిల్స్‌కు సరైన సమాధానాలు రాసిన వారు :

క్విజ్ 21 : **బి. గాయత్రి**, కర్నూలు. **వి. గిడ్యోన్**, ముంచంగిపుట్టు, **బి. సుభాషిణి**, **ఓ. లక్ష్మీరేఖ**, **టి. నవ్యవాణి**, చీరాల, **పాగల నాగజ్యోతి**, **పాగల నాగప్రశాంత్**, మదనపల్లి, **ఎం. త్యాగరాజు**, నరసన్నపేట, **పాగల నాగజ్యోతి**, మదనపల్లి,

రుక్మిణి

"ఈ మొత్తానికి మొత్తం ప్రపంచం... భూగోళం బతికి బట్టకడుతుందనే నమ్మకం లేదు. అసలు మన 'స్వర్ణాంధ్ర' ఇట్లానైనా మరికొద్దికాలం మిగిలుంటుందనే ఆశలేదు... ఛ...ఛ... మనం ఇన్నివేల పథకాలు పెట్టి-ఊదరేసి జనాల్ని వాళ్ళ కాళ్ళ మీద వాళ్ళనే నిలబడమని చెప్తున్నా వాళ్ళు బతికి బట్టకట్టి బతుకుతారని నమ్మకం టోటల్‌గా లేదని తెలియజేసుకుంటున్నాను..."

సమావేశంలోని వచ్చచొక్కాల ఎమ్మెల్యేలు... మంత్రుల.... ఎంపీలు... ఒక్కసారే గందరగోళంలో పడి బాబుగారి వంక హడలిపోయి చూశారు. కొంపదీసి, ఈ మధ్య ఏ అమెరికా సన్యాసిగాడో వచ్చి ఫారిన్‌టైపు 'కర్మయోగ వైరాగ్య సిద్ధాంతం' వంటిది అంటించినాడా... ఏ అడవిలోకో పోయి ముక్కులు మూసుకుని మూలుక్కుంటూ... నీలుక్కుంటూ ఒంటికాలు ధ్యానానికి తగులుకోమంటాడో కర్మ!

"త్వరలోనే మనం 'ఓజోన్' సంరక్షణ కార్యక్రమాన్ని అమలు చేయాలె! ఈ రాష్ట్రంలోని సమస్త ఈతిబాధలకూ... రోత బతుకులకూ... కంపల్లో ఇరుక్కుపోడానికీ అదే కారణం! ఓజోన్.. ఓజోన్...ఓజోన్...!

బాబుగారు చాలలా ఉద్విగ్నంగా అట్లా ఆవేశంగా అనేసి, విచారంగా అందరికేసి చూశాడు. "అసలీ 'ఓజోన్' ఏ ప్రాంతపుదీ... ఆ ముఠాలో ఎంతమంది? టెర్రరిస్ట గుంపా... రాకాసితోకలాంటిదా... దాని దెబ్బ ఎట్లా ఉంటుందీ.. అది మన స్వర్ణాంధ్ర మీద కసాపిసా విరుచుకు పడే ముహూర్తం ఎవుడు చెప్పిందీ...!" ఈ ఆలోచనలతో సభ్యులందరి గుండెలు గుబగుబలాడిపోయినాయి. ఓ పావుగంట అందరూ రాతి బొమ్మల్లా కూర్చుండిపోయినాక ఓ మంత్రిగారు ధైర్యం చేసి 'అన్నా... మనం 'అదనపులోడు' కరంటు ఛార్జీలు పెంచిపారేసినం... జనాలు గోలకు తగులుకుంటున్నారు. ఇప్పటికే అట్లాంటి అలగా పులగా ఛార్జీల్ని రకరకాలుగా పెంచిపారేస్తిమి..."

"ఓజోన్... (శాంతగంభీర స్వరం) ఆ పొరగ్గానీ బొక్క పడిందా ఈ లోడ్లూ... ఛార్జీలు... బిల్లులు ఎవడూ మిగలడు! ఈ విషయంలో మీరు జనాల్ని బాగా ఎడ్యుకేట్ చెయ్యాలి...!" ఆ మంత్రి అవాక్కై నోరు మూసుకున్నాడు.

"అదిసరేగాని సార్! మన వాండ్ల తాలూకు ప.ఆహారం బియ్యం లారీ లోడ్లు లోడ్లు పక్క రాష్ట్రాలకు వాళ్ళ అవసరాలకని అందజేస్తుంటే ఎక్కడ బడితే అక్కడ కూలిజనాలు పట్టుకుని గోలకు తగులుకుంటున్నారు - ప్రతివాడికీ 'మన బియ్యం' మీద కన్నే! మళ్ళా కేంద్రం ఇచ్చే బియ్యం దెబ్బ తట్టుకోడం ఎట్లా... అమ్ముకోడం ఎట్లా అని తలలు పట్టుకుంటున్నారు..."

"ఛ....ఛ... మీకు మైండ్‌సెట్ కావాలె! అవతలేమో లోడు మీద లోడు పెరిగి 'ఓజోన్‌కు బొక్క' పడిపోతుంటే ఈ బియ్యం... లారీలు.. కరువు పనులూ ఖతం! ఓజోన్ గురించి మన శాస్త్రవేత్తలు మంచి పాఠాలు.. ప్రణాళికలు... పథకాలు తయారు చేసి పెట్టారు... జనానికి దాన్ని బాగా ఎక్కించకపోతే ఇంగ వాండ్లు బతికి బట్టకట్టలేరని చెప్పాలె! అదరగొట్టాలె! అంతే ఓజోన్... ఓజోన్...!" ఆ మంత్రి కుదుటపడి మనసులో 'ఓజోన్'కు ఓ దండం పారేశాడు.

"మా జిల్లాల ఫ్లోరైడు నీళ్ళు... కాళ్ళు చేతులు వంకర్లు పోతున్నాయి....'మంచినీళ్లో' అని జనం మీదబడి కరుస్తున్నారు... లాభం లేదు... గోల...

"ఓజోన్... ఈ మంచినీటి పథకాలూ... మంత్రాలూ... చింతకాయలూ ఓజోన్ ముందు బలాదూర్... ముందు 'ఓజోన్' డోసు గట్టిగా తగిలించండి... మంచినీళ్ళమాట మరిచిపోయి మూటా ముల్లె సర్దుకుంటారు - మూతి మూసుకుంటారు".



అప్పటికి అందరికీ అలుపు రావడంతో ఆలోచనంతా ఈ ఓజోన్ మీదికి మళ్ళింది. "ఈ భూమండలం మీద పెద్ద పొర కప్పుకుని ఉంది. టోటల్‌గా అది మీకు అస్సలు కనపడదు గానీ... దానికి బొక్కగానీ పడిందంటే... మన ఫ్లైఓవర్లూ... ఇంకుడు గుంతలూ... కరకట్టలూ... స్వయం సహాయక బృందాలు... వెలుగు పథకాలూ చీకట్లో చిందులేస్తాయి... దానికి బొక్క పడకుండా చూడడం మన స్వర్ణాంధ్ర పౌరుల బాధ్యత... కర్తవ్యం... దాని గురించి విపరీతంగా ప్రచారం చెయ్యాలె... "ఓజోన్ పండుగలూ... దశల వారీగా... ఓజోన్ రంజాన్.. ఓజోన్ ఉగాది... ర్యాలీలు... నినాదాలు తయారు చేయించండి... ఊరేగింపులు... ఓజోన్ టోపీలు తగిలించుకుని గ్రామగ్రామానా మీటింగులు పెడితేగానీ ఆ ఓజోన్ దెబ్బ తట్టుకోలేం! డేంజర్...!"

అందరూ తలలు పట్టుకుని ఊపిర్లు వదిలారు.

"మన భవిష్యత్ పథకం అదే... ముందు మీరందరూ ఫ్రిజ్జులు వాడడం బందు చెయ్యాలే... చంకల్లో వాసన డబ్బాలు బంద్! కేంద్రం వారు ఆదేశాలిచ్చారు. పచ్చదనం... పరిశుభ్రం... దీనికో నోడల్ వ్యవస్థ ఏర్పాటుంటుంది. అధికార్లుంటారు - ఖర్చుంటుంది... అప్పుతెద్దాం! మీరందరూ పచ్చదనాన్ని కాపాడితేగానీ మనపార్టీ పది కాలాలపాటు అధికారంలో కొనసాగుతుంది!"

అందరూ బిత్తర పోయారు - తమది పచ్చ పార్టీయా? అయితే పసుపు బదులు ఆకుపచ్చ రంగులోకి ఫిరాయింపు పల్టీగాని వేస్తే-"ఇదేం పీకులాటరా దేవుడా" అని సభ్యులందరూ హడలిపోయారు.

"చెప్పండి! ఈ 'ఓజోన్' మీద మీరేం చేయాలనుకుంటున్నారు." బాబుగారు సూటిగా అడిగేసరికి అందరూ వంకర టింకరగా అంచనాలకు తగులుకున్నారు.

"ఏవుందీ... కాలుష్యం అంటున్నారుగా... కార్లు... ఆటోలు... బస్సులూ టోటల్‌గా బందుపెట్టి తలా ఓ సైకిలేసుకుని తిరగండని ఆర్డరేస్తే సరిపాయె! పొగరాదు - జనాలు కూడా 'సైకిలు పీడేందిరా' అని ఇంటి దగ్గరే నీలుగుతారు -మనదీ సైకిలేనాయె"!

"నో... నో... ప్రజల భాగస్వామ్యం... రేపు ఓట్లు వేసేది వాళ్ళే! కుదర్దు!" "పచ్చదనం అంటున్నారుగా... రాష్ట్రం మొత్తానికి మొత్తం అంతా ఆకుపచ్చరంగు పూసి పారేస్తే ఎట్లా ఉంటుంది... అన్ని రంగులూ బంద్... ఖడేజావ్! ఆ దెబ్బకు మొత్తం జనాలకు కండ్లుబైర్లు గమ్మి ఆకుపచ్చ కంచాల్లో అన్నాలు తింటారు"

"ఛ... ఛ... అది డేంజరు.. మనం చెట్లు పెంచాలి.. చెట్లు పెంచని వాడు ఈ రాష్ట్రానికి ద్రోహీ... అభివృద్ధి నిరోధకుడూ... అరాచకుడూ అని ప్రచారం చేస్తే పోలా...!" ఓ మంత్రి నెమ్మదిగా గొణిగాడు.

"అదేం కాదు... బడిపిల్లలందర్ని కలుపుకుపోవాలె! ఓ నెల రోజులు చెట్లూ... పెంపకం...పచ్చదనం... 'ఓజోన్ బొక్క' గురించి బజార్లలో పచ్చ జెండాలు తగిలించుకుని ప్రచార భేరీ నిర్వహించాలె.. ఒక్కో మండలం... జిల్లాకో కమిటీ... దాని ఖర్చుకు ఓ అయిదారువేల కోట్లు కేటాయిస్తున్నాం.. మన బ్యాంకిస్తుంది...

'ఓజోన్ బొక్క' గురించిన చర్చ మహ ఉల్లాసంగా సాగిపోతుంది. బయట గోడమీద కూర్చున్న మగ చిలుక ఆడచిలుకతో విచారంగా అంది.

"ఓజోన్ బొక్కకూ" ఆకలికి కుతకుత కాలే జనాల డొక్కలకూ ఏంటో సంబంధం? ఈసారి ఒంట్లో ఏ బొక్కా లేకుండా ఏరిపారేస్తారు- ప్చ్... ఎంతకాలం ఈ మాటలు... మంత్రాలు పని చెయ్యవులే..."

ఆడ చిలుక కువకువమని మురిపెంగా కులికింది!

పురోగమిస్తున్న రాష్ట్ర క్రీడారంగం

మారేపల్లి లక్ష్మణ్

మొయినుద్దౌలా గోల్డ్‌కప్ క్రికెట్ టోర్నమెంట్‌లో ఒక మ్యాచ్ దృశ్యం

క్రీడారంగంలో దేశంలోనే హైదరాబాద్ ప్రత్యేక స్థానాన్ని ఆక్రమిస్తున్నది. ఇటీవలి కాలంలో హైదరాబాద్ జాతీయ, అంతర్జాతీయ టోర్నీలకు ఆతిథ్యమిస్తూ క్రీడారంగంలో అగ్రస్థానానికై ఉరకలేస్తున్నది. ఇదివరకు క్రీడలంటే చెన్నయ్, కలకత్తా, ఢిల్లీ, ముంబయిలే గుర్తుకు వచ్చేవి. ఇపుడు వాటి సరసన హైదరాబాద్ కూడా సగర్వంగా నిలిచింది. ఈ సంవత్సరం జాతీయ క్రీడలకు ఆతిథ్యమిస్తున్న హైదరాబాద్ చాలా క్రీడాంశాలలో జాతీయ, అంతర్జాతీయ టోర్నీలను నిర్వహించింది, నిర్వహిస్తున్నది. జాతీయ క్రీడల కోసం నిర్మించిన స్టేడియాలను ఒక్కొక్కటిగా సంబంధిత క్రీడ అంతర్జాతీయ టోర్నీతో ప్రారంభిస్తున్నారు. గచ్చిబౌలిలోని ప్రధాన స్టేడియమైన అథ్లెటిక్ స్టేడియంలో ఆసియా గ్రాండ్ ప్రి అథ్లెటిక్ మీట్‌తో, యూసుఫ్‌గూడలోని వాలీబాల్ స్టేడియంను శివంతి ఆదిత్యన్ అంతర్జాతీయ వాలీబాల్ టోర్నమెంట్‌తో, ఫతేమైదాన్‌లోని టెన్నిస్ స్టేడియంను జీవికె అంతర్జాతీయ మహిళా(ఐటిఎఫ్) టెన్నిస్ టోర్నీతో ప్రారంభించారు. భారత్, ఇంగ్లండ్ వన్డే క్రికెట్ మ్యాచ్‌కు, భారత-ఇంగ్లండ్ యువ జట్ల మధ్య ఒక టెస్ట్ మ్యాచ్, మూడు వన్డేల సిరీస్‌కు, భారత-జర్మనీ మూడు టెస్ట్‌ల హాకీ మ్యాచ్‌లాంటి అంతర్జాతీయ టోర్నీలకు హైదరాబాద్ వేదికగా నిలిచింది. ఇవేకాక ఆర్చరీ, సాఫ్ట్‌బాల్, సెపక్‌తక్రా, సబ్‌జూనియర్ చెస్, మొయినుద్దౌలా గోల్డ్‌కప్, గోకార్టింగ్, రెగెట్టా క్రీడాంశాల్లో జాతీయ పోటీలను ఇటీవలి కాలంలో హైదరాబాద్‌లో జరిగాయి. త్వరలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ప్రపంచ కప్ చెస్, ఆసియా అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లకు హైదరాబాద్ ఆతిథ్యమివ్వనుంది. చెస్ ఒలింపియాడ్‌ను కూడా హైదరాబాద్‌లో నిర్వహించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు భారత చెస్ సమాఖ్య ఉపాధ్యక్షుడు ఉమర్‌ఖోయా ప్రకటించాడు.



ఐ.టి.ఎఫ్. మహిళా టెన్నిస్‌టోర్నీలో శృతి ధావన్

హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన ఆర్చరీ పోటీల దృశ్యం

ఆసియా గ్రాండ్ ప్రి అథ్లెటిక్ మీట్‌లో వివిధ దేశాలకు చెందిన అగ్రశ్రేణి అథ్లెట్లతో పాటు భారత అథ్లెట్లు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జె.జె.శోభ, లక్ష్మిలకు ఈ పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కింది. అలాగే ఆదిత్యన్ వాలీబాల్ టోర్నమెంట్‌లో భారత సీనియర్, జూనియర్ జట్లతో పాటు థాయిలాండ్, మయన్మార్, కజకిస్థాన్ జట్లు పాల్గొన్నాయి. భారత సీనియర్ జట్టుకు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రవికాంత్‌రెడ్డి కెప్టెన్సీ వహించగా, జూనియర్ జట్టుకు కూడా రాష్ట్రానికే చెందిన కాశీవిశ్వనాథరాజు నాయకత్వం వహించాడు. ఇరు జట్లలో రాష్ట్రానికి చెందిన పలువురు వాలీబాల్ క్రీడాకారులకు ప్రాతినిధ్యం లభించింది. అంతర్జాతీయ మహిళా టెన్నిస్ టోర్నమెంట్‌లో రాష్ట్రానికి చెందిన కొమ్మిరెడ్డి పూజ, పూనమ్‌రెడ్డితో పాటు పలువురు క్రీడాకారిణులు డైరెక్ట్ ఎంట్రీ ద్వారా, మరికొందరు క్వాలిఫైయింగ్ రౌండ్ల ద్వారా పోటీల్లో పాల్గొని ప్రతిభను చాటారు. రామోజీ ఫిల్మ్ సిటీలో వచ్చే నెల మొదటి వారంలో ప్రపంచ చెస్ కప్ జరుగుతుంది. ఈ పోటీల్లో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన చెస్ ప్లేయర్లు గ్యారీ కాస్పరోవ్, కార్పొవ్, విశ్వనాథన్ ఆనంద్, వ్లాదిమిర్ క్రామ్నిక్‌లతో వివిధ దేశాలకు చెందిన పలువురు గ్రాండ్ మాస్టర్లు, దేశంలోని గ్రాండ్ మాస్టర్లు పాల్గొంటున్నారు. రాష్ట్రానికి చెందిన యువ గ్రాండ్ మాస్టర్లు కోనేరు హంపి, హరికృష్ణ వీరితో తలపడతారు. అంతేగాక వర్ధమాన క్రీడాకారులు వారి ఆటతీరును తిలకించే అవకాశం లభిస్తున్నది. భారత, ఇంగ్లండ్ యువజట్ల వన్డే సిరీస్‌కు రాష్ట్రానికి చెందిన జ్ఞానేశ్వర్‌రావు నేతృత్వం వహించాడు. అంతర్జాతీయ టోర్నీలతో పాటు పలు జాతీయ టోర్నీలకు కూడా హైదరాబాద్ వేదికగా నిలుస్తున్నది. ఎల్బీ స్టేడియంలో జరిగిన జాతీయ విలువిద్య పోటీల్లో నిజామాబాద్‌కు చెందిన గిరిజన బాలుడు సీతారాముడు స్వర్ణం గెలుచుకొని సంచలనం సృష్టించాడు. ఇదే పోటీల్లో శివనాథ్ పసిడి, సుజాత వెండి జిలుగులను వెదజల్లారు. అలాగే ఒక్రిడ్జ్ జాతీయ సబ్‌జూనియర్ చెస్ టోర్నీలో రాష్ట్రానికి చెందిన రోహిత్ అగ్రస్థానంలో నిలువగా, పలువురు రాష్ట్ర క్రీడాకారులు చక్కని ప్రతిభను చాటారు.

ఇటీవలి కాలంలో రాష్ట్ర క్రీడాకారులు సరికొత్త రికార్డులతో జాతీయ, అంతర్జాతీయ వేదికలపై విజయాలను సాధిస్తూ తెలుగు తేజాన్ని నలువైపులా చాటుతున్నారు. అదే రీతిలో ప్రభుత్వం కూడా నగదు పురస్కారాలతో సత్కరిస్తున్నది. ఈ ప్రోత్సాహంతో ఉత్తేజితం పొందిన పలువురు క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ రంగంపైకి ఉవ్వెత్తున దూసుకువస్తున్నారు. కరణం మల్లేశ్వరి ఒలింపిక్ పతకంతో ప్రారంభమైన రాష్ట్ర క్రీడా వైభవం గోపీచంద్, వివిఎస్ లక్ష్మణ్, మిథాలీరాజ్, హరికృష్ణ, కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక, రోహిత్, మహేష్ భూపతి, సానియా మిర్జా, పూజారి శైలజ, నీలంశెట్టి లక్ష్మి, అంబటి రాయుడుల ప్రతిభతో నిరంతరాయంగా పయనిస్తున్నది. పలువురు వర్ధమాన క్రీడాకారుల అద్భుత ప్రతిభా పాటవాలతో రాష్ట్రం విజయ సోపానాలను అధిరోహిస్తోంది ✤

కరువు కోరలు

మార్ల మనోహర్

బస్సులో కూకోని ఆలోచిస్తాండా, అయినా నా అనుమానం తీరలేదు, ఎందుకబ్బా? అన్న ఎద్దును తోల్కొని పామిడి కల్ల పోతాండని, అన్నకు తోడు, ఇంకా ముగ్గురు రైతులు కూడ వాళ్ళ వాళ్ళ ఎద్దుల్ని తోలుకొని కాలినడకన అన్న ఎంటే పామిడి కల్ల పోతాండారు, వాళ్ళెంట పోతున్న ఎద్దులు శానా చిక్కిపోయినాయి. ముఖ్యంగ, మా అన్న తోల్కపోతున్న మా కర్రెద్దు లక్ష్మన్న మిగిలిన దాన్లకంటే శానా చిక్కిపోయింది. లక్ష్మన్న అనేది మా కర్రెద్దు ముద్దుపేరు. మా ఇంట్లో ఉన్న కర్రావుకు కవల దూడలు పుడితే. ఒక దానికి రామన్న అని, మరో దానికి లక్ష్మన్న అని, పేర్లు పెట్టి శానా మురిపెంగ సాకుతాండాము. మూడు సంవత్సరాల క్రితం కండలు తిరిగిన ఒళ్ళుతో, బక్కచిక్కి శుష్కించిపోయి ఎముకల గూడు మిగిల్చుకున్న దాన్లా శానా చిక్కిపోయింది. బస్సు వేగంగ వాళ్ళని దాటేసుకొచ్చింది. ల్యాకుంటే వాళ్ళ ప్రయాణంనకు కారణం అడిగే వాణ్ణి. మా వూరి నుండి ఎవళ్ళైన ఎద్దుల్ని నడిపించుకుంటు పామిడికల్ల పోతే మాకు ఒకటే గుర్తు. ఆ ఎద్దుల్ని పామిడిలో జరిగే పశువుల సంతలో అమ్మటానికే అని.. కొంపదీసి అన్న కూడ ఎద్దుని పామిడి సంతలో అమ్మనీకి తీస్కపోతాండా ఏంటి? ఆహ... అంత ఖర్మ అన్నకు ఎందుకు పట్టింటుంది? పశుల్ని కొనటమే కాని అమ్మటం అన్నకు ఇష్టం ఉండదు, అట్లాంటి మనిషి ఎంతో మురిపెంగ సాక్కున్న ఎద్దును పశుల సంతలో ఎందుకు అమ్ముతాడు? మరి! ఎందుకు పోతున్నట్లు? ఇలా పరిపరివిధాలుగా నా మనస్సు ఆలోచిస్తోంది, బస్సు వేగంగా ముందుకు సాగిపోతాంది. నా ఆలోచనల్లు కూడా బస్సు కంటే మరింత వేగంగా ముందుకు కదులుతుండాయి. కళ్ళు మూసుకొని దీర్ఘాలోచనలో ఉన్న నేను కీచుమనే శబ్దంతో ఉలిక్కిపడి దిగ్గున లేచి కండ్లు తెరిచి చూశాను. బస్సు మా వూరి స్టేజిలో వచ్చి నిలబడింది. బస్సు నిలబడగానే లగేజీ తీస్కొని బస్సు దిగి ఇంటిదోవ పట్టాను. ఇక్కడికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉంది మావూరు. మావూరికి ఇరుకైన రోడ్డు ఉన్నందున, బస్సు సౌకర్యం లేదు, ఎవరైనా సరే రోడ్డు మీద బస్సు దిగి కాలినడకతో ఊర్లోకి రావాల్సిందే, అయినా అప్పుడప్పుడు, జీపు-ట్రాక్టర్ లాంటి చిన్న చిన్న వాహనాలు మా వూరికి వస్తూ పోతుంటాయి. నేనా ఊరువిడిచి దాదాపు మూడు సంవత్సరాలైంది. డిగ్రీ వరకు చదువుకున్న నాకు ఏ చిన్న ఉద్యోగం దొరకనందున, ఇంటికాడే ఉండి అన్నకు, నాన్నకు వ్యవసాయం పనుల్లో చేదోడు వాదోడుగా ఉంటుండే వాణ్ణి. కాని టౌన్‌లో సుఖమైన జీవితానికి అలవాటు పడిన నాకు వ్యవసాయం పనులు చేతకాకపోవటం వల్ల, నా బాధను గుర్తించి మా నాన్న నన్ను పదే, పదే హెచ్చరిస్తుండే వాడు. ఒరేయ్... చిన్నాడా! నీకీ వ్యవసాయం చేతకాదుగాని, టౌన్‌కు పోయి ఏదైనా ఉద్యోగం సంపాయించుకోపో అంటూ నన్ను పదే పదే హెచ్చరిస్తుంటే ఆయప్ప మాట కాదన్లేక నేను బెంగుళూరుకు పోయి మాకు తెలిసిన ఓ ఆసామి ద్వారా చిన్న కంపెనీలో పని కుదుర్చుకొని మూడు సంవత్సరాల నుండి అక్కడే ఉంటున్నాను, నెలకోసారి ఉత్తరాలు రాస్తూ ఇంట్లో వాళ్ళ యోగక్షేమాలు తెలుసుకుంటుండేవాణ్ణి. కాని ఈసారి మాత్రం నాయనే జాబు రాసినాడు. ఒరేయ్, చిన్నాడా! ఈ జాబు చూచిన వెంటనే వచ్చేయ్‌రా అని. ఉన్న ఊరు కన్న తల్లి లాంటిది కదా. కన్న తల్లి లాంటి మా వూరికి మూడు సంవత్సరాల తర్వాత తిరిగి వస్తున్నందుకు నాకు శానా సంతోషంగా ఉంది. అందునా మావూర్లో జరిగే నాగుల చవితి పండుగంటే నాకెంతో ఇష్టం. ఇంటి కాడ అమ్మ, నాన్న, వదిన, పిల్లలు, ఎంతగానో నా రాక కోసం ఎదురు

చూస్తుంటారు నేను కూడ ఎన్నో ఏళ్ళ తర్వాత తిరిగి చూడాలనే ఆత్రంతో వడివడిగా అడుగులు వేసుకుంటూ ముందుకు సాగిపోతాండా. మనస్సు నిండా ఆనందం నింపుకొని గబగబ ముందుకు నడుస్తాండా. అట్ల కాసింత ముందుకుపోగా నాకెదురుగా రెండు ట్రాక్టర్లు రయ్... అని నా వైపుకు స్పీడుగా వస్తున్నట్లు గమనించినాను, ఆ ట్రాక్టర్లు సరాసరి నా దగ్గరకు రాగానే తదేకంగా ఆ ట్రాక్టర్‌ల దగ్గిరి కెళ్ళి ఎంతో నిఘాగా గమనించాను, ఆ ట్రాక్టర్లలో కొన్ని పశువుల్ని వేసుకొని పోతాండారు. ముందుస్తున్న ట్రాక్టర్లో మూడు చిక్కిపోయిన ఎద్దుల్ని, మరొక ట్రాక్టర్లో కొన్ని గొర్రెల్ని కుప్పగా ఒక దానిపై ఒకటి రాశిలా పోసి దాన్లకు ఏ మాత్రం ఊపిరాడనీయకుండా శానా రాక్షసత్వంగ తీస్కపోతాండారు. బ్యా... బ్యా... అంటు దీనంగా అరుస్తున్న ఆ గొర్రెల్ని చూడగానే నా మనస్సు చివుక్కుమంది, ఏమిటి? నోరు లేని జీవాలకు, కూడ ప్రాణం ఉంటుందనే సంగతి మర్చిపోయి, దాన్లను అట్ల రాక్షసత్వంగ తీస్కపోతాండారే. వీళ్ళు నిజంగ మనుషులా? లేక కసాయి వాళ్ళా? వీళ్ళ వాలకం చూస్తాంటే, వీళ్ళు నిజంగ కసాయి వాళ్ళే, పశువుల రక్త మాంసాలతో వ్యాపారం చేస్కొని బతికే కసాయి వాళ్ళు. అయినా కసాయి అంగడికి పశువుల్ని అమ్ముకునే దుస్థితి మా వూరి వాళ్ళకు ఎందుకొచ్చిందబ్బా? అంటూ నన్ను నేనే ప్రశ్నించుకొని మెల్లిగా ముందుకు కదిలాను. నేను నడుస్తున్న దోవకు ఆ పక్కా ఈ పక్కా ఉన్న బీడు భూముల్ని చూడగానే నా కళ్ళను నేను నమ్మలేక పోయాను. ఒకప్పుడు పచ్చని చెట్లతో కళ కళ లాడుతూ వచ్చేవారిని స్వాగతిస్తూపోయే వారికి వీడ్కోలు పలుకుతున్నట్లుగా అరచేయంత వెడల్పుతో కంకులు నింపుకున్న, జొన్న, నేడు ఎండిన దంట్లతో, చిరుగాలికి చిటపటలాడస్తూ వచ్చేవారిని, పోయే వారిని వెక్కిరిస్తున్నట్లు నిల్చున్నాయి. ఆ చేన్లన్నీ నోర్లు తెరుచుకొని, బీళ్ళు బారి పోయాయి. ప్రతి ఏటా నాగుల చవితి పండుగ నాడు, మా వూరికి దగ్గర్లో ఉన్న బైరవ కొండెక్కి చుట్టూ పరిశీలనగ చూస్తే, కొండ చుట్టూ ఉన్న చేన్లన్నీ పచ్చని తివాచి పరిచిన దానివలే పచ్చగా కనిపించేవి. ప్రతియేటా మేము నాగుల చవితి పండుగకు పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా కొండపైకెక్కి ఆ పండుగ ఎంతో సంబరంగ జరుపుకుంటాం, అక్కడున్న రాతి నాగ విగ్రహంపై కొబ్బరి చిప్పలు నూర్కొని తిని ఎంతో సంబరంగా అక్కడ గడుపుతాం. అక్కడి నుండి కొండకిందున్న పచ్చని పైర్లను చూస్కొని పులకించుకపోతాం. నేటి పండుగ వాతావరణంలో అలాంటి పరిస్థితేది. ఇప్పుడు కనబడ్డం లేదు, పాడి, పంటలకు ప్రసిద్ధి చెందిన మా వూరి రైతులు. తమకున్న భూముల్ని చక్కగా సాగు చేసుకుంటు అందరూ ఐక్యంగా బతుకుతూ కలిసి మెలిసి సహజీవనం గుడుపుతాంటారు. ఎంతో ప్రశస్తమైన మా వూరి వాతావరణం తల్చుకుంటు నేడు కనిపిస్తున్న పరిస్థితుల్ని గమనించుకుంటు బరువెక్కిన హృదయంతో ముందుకు

సాగిపోతున్న నాకు... ఇంకొంచెం దూరంలో మా చేను కనిపించింది. అక్కడో మనిషి ఆ పక్కకు తిరిగి కూర్చొని కంటికి అరచేయి అడ్డు పెట్టుకొని, ఎర్రటి ఎండలో నెర్లు బారిన చేను మధ్యలో కూకొని దీనంగా ఆకాశం వైపు చూస్తాండాడు. బహుశా వాన చుక్క కోసం ఏమో? ఆయన ఎవరై ఉంటారబ్బా? అని మనసులో తల్చుకొని, రోడ్డు దిగి చేన్లోకి నడిచాను. నేనడుస్తున్న చేనుకు ఇంకొంచెం దూరంలో ఓ బక్క చిక్కిన ఎద్దు ఒకటి తినటానికి ఏ మాత్రం గడ్డి లేక చేను గట్టు పై నున్న ఎండు పుల్లల్ని మేస్తోంది. ఆ ఎద్దు శానా చిక్కిపోయింది. నా రాకను పసిగట్టిన ఆ ఎద్దు మేస్తున్నది విడిచి పెట్టి మోర ఎత్తుకొని నాకల్లే వస్తాంది. అట్ల వస్తున్న ఆ ఎద్దును చూడగానే నా మనస్సు తరుక్కుపోయింది. ఆ ఎద్దుపై కాసింత జాలి కల్గి, ఆ కాడికి పోయినా, అదేంటబ్బా? మా పెద్దెద్దు. రాముడు ఇట్లైనాడని అనుకొని చిక్కి శల్యమైన ఆ ఎద్దు తలపై ఓ చేయి వేసి చిన్నగా నిమురుతూ, మరో చేత్తో గంగడోలును చిన్నగా సవరిస్తూ దాని వైపు తదేకంగా చూస్తాండా. పాపం దానికి దప్పికైందేమో.... దప్పికతో వగిరిస్తాంది. కళ్ళలో నీళ్ళు జల జల రాలుతాండాయి. దీనంగా చూస్తూ కన్నీరు కారుస్తున్న ఆ ఎద్దును పట్టుకొని ముందుకు కదిలాను. నా రాకను ఏ మాత్రం గమనించకుండా తదేకంగా ఆకాశంపై కల్లే చూస్తోన్న మా నాయన దగ్గరికి పోయి నాయనా అని గట్టిగా పిలిచాను. ఆ పిలుపుకు ఉలిక్కిపడి ఒక్కసారి వెనక్కు తిరిగి చూశాడు. నన్ను చూసి చూడగానే, ఏరా! చిన్నాడా. ఎప్పుడొచ్చివి,అంటూ ఆప్యాయంగా అడిగినాడు. ఇప్పుడే నాయనా వచ్చింది ఇదే రావటం! ఏం... నాన్నా బాగుండావా? అంటూ ఆత్రంగా అడిగాను, నాకేంరా! బాగున్నాను. నువ్వు ఎట్లుండావు బాగున్నావా? మరింత ఆత్రంగా ఎదురు ప్రశ్నేశాడు. ఎండిన డొక్కలతో మాసిన గడ్డంతో, చిరిగిన బట్టలతో ఉన్న నాన్నను తదేకంగా చూస్తూ ఏంది నాయనా! ఇట్లైనావు. ఏం ఆరోగ్యం బాలేదా? అంటూ ఎండిన డొక్కలతో శుష్కించి ఉన్న నాన్నను అడిగాను. ఏం చెబతాను లేరా. ఇదంతా ఈ ఊరికి పట్టిన ఖర్మరా.. ఇది. పద ఇంటిపోదాం అంటూ ఒకదుగు ముందుకు వేశాడు నాయన. ముందుకు నడుస్తున్న నాయన్ను ఉద్దేశిస్తూ ఉండు నాయనా! ఉండు, ఏం జరిగింది, ఈ వూరికేం ఖర్మ పట్టింది. అవును నాక్కూడా ఇక్కడ చూస్తాంటే ఏందో అనుమానం వస్తాంది. ఎందుకు ఎవళ్ళు కూడా చేన్లలో చెనికాయవేయలేదు. చేన్లన్ని బీళ్ళు పెట్టుకొన్నారు. ఎందుకేయలేదు అంటూ ఆత్రంగా అడుగులతూ అక్కడున్న పరిస్థితిలపై ఒకదాని వెంట ఒకటి ప్రశ్నలతో నాయనపై ప్రశ్నల వర్షం కురిపించాను. నా ప్రశ్నల వర్షంకు తడిచిపోయిన మా నాయన గబ గబ నాకాడికి పరుగెత్తుకొచ్చి నన్ను గట్టిగా హత్తుకొని అయిపోయిందిరా! చిన్నాడా అంతా అయిపోయింది ఈ ఊరు సర్వనాశనం అయిపోయింది. ఊర్లో జనాలకు తిండి లేదు, అడవిలో చేన్లకు నీళ్ళు లేవు. జనాలకు తిన్నీకి తిండి లేక అన్నమో రామచంద్రా! అంటూ అల్లాడుతున్నార్రాంటు తలకు చుట్టుకున్న తువాలు తీస్కోని ముఖంకు అడ్డుపెట్టుకొని, పిల్లోని మాదిరి వెక్కి వెక్కి ఏడుస్తున్న నాయనను సముదాయిస్తూ ఆయప్ప కండ్ల నీళ్ళు తుడుస్తు ఏం జరిగిందో కొంచెం చెప్పు నాయనా అంటూ ఆత్రంగా అడిగినాను. ఏం చెప్పేదిరా! చిన్నాడా! ఏందో కరువొచ్చిందంట మాయదారి కరువు. మంచి ఇత్తనం కాలంలో వానలు రాకుండా, చేన్లకు నీళ్ళు కరువై మంచులకు (మనుషులకు) బతుకులు బరువై తిన్నీకి తిండిలేక, చేయటానికి పన్లు లేక అంతా ఊర్లుడిచి వల్సపోతాండార్రా. పుట్టించుకున్న పిల్లోల్కి తిండి పెట్టి సాకలేక దత్తత పేరుతో కాసిన్ని రూకలకు, పరాయోళ్ళకు అమ్ముకుంటాండారు. పుట్టించుకున్న పిల్లోల్ని, సాక్కున్న పశుల్ని నూటికో ఇన్నూటికో అమ్ముకొనే బతుకొచ్చిందిరా మనూరోళ్ళకు. కార్తులు దాటిపోతున్న వాన చుక్క పడకపాయె, చేన్లన్ని బీడు పెట్టుకోక ఏం చేత్తాం? అంటూ వెక్కివెక్కి ఏడుస్తాండాడు. అదేంటి నాయనా! పిల్లోల్ని, పశుల్ని అమ్ముకుంటాండారా? ఎంత ఖర్మ పట్టిందీవూరికి, అయితే... అయితే... అన్న నల్లెద్దును పట్టకపోతాంది అమ్మనీకా? అంటూ ఆత్రంగా అడిగా అవునుర్రా చిన్నాడా! ఇంట్లో జరగటం కష్టంగా ఉంది. ఇంట్లో మీయమ్మ కూడ పాలిమాలింది (ఆరోగ్యం దెబ్బతింది). అందుకే ఆ ఎద్దును సంతలో అమ్మేసి అనంతపురంలో మందులు తీస్కరమ్మన్నాను. రేయ్ చిన్నాడా! నేనెప్పుడూ ఇట్లాంటి కరువు చూల్లేదురా ఎప్పుడో నా పిల్లతనంలో వచ్చింది ఇట్లాంటి కరువు. అప్పట్నుంచి ఇప్పటివరకు ఇట్లాంటి కరువు చూల్లేదురా! అప్పుడన్నా ఆ గవర్నమెంటోళ్ళు మాకు మా బతుకుల కోసం పని చూపించి మాకు కాసింత బువ్వ పెట్టినారు. కాని ఇప్పుడున్నాళ్ళు, ఇప్పటివరకు ఈ మధ్యలకు తొక్కి చూల్లేదు. ఊళ్ళో జనాలకు తిండి లేక పనుల కోసం పిల్లాల్ని ఏసుకొని బళ్ళారి, హోస్పేటకు బతకనీకి పోయినార్రా ఇప్పుడు ఊళ్ళో ఎవల్లు లేరు, ఊర్లో కనీసం మంచినీళ్ళు కూడ దొరకటం శాన కట్టంగా ఉంది. కడవ నీళ్ళు కోసం మైళ్ళ దూరం పోవాల్సిందేరా, ఎంతో మురిపెంగ సాక్కున పశుల్ని, కటికోళ్ళకు నూరు, ఇన్నూరుకు కొల్ల బెడతాండారు అని గుండె నిండ ఉన్న బాదలన్నిటి ఒక్కొక్కటిగా చెబుతూ బొటబొట కండ్ల నీళ్ళు కార్చాడు. ఆ పరిస్థితి వినగానే నాకు బాధ కల్గి ఎన్నికలప్పుడే గాని ఎన్నికైన తర్వాత కన్పించకుండ పోయే దుష్టరాజకీయ నేతల్ని మనసులో తిట్టుకుంటు, అదేంటి నాయన ఊర్లో ఇంతకరువొచ్చి, మీరింత తిప్పలు పడ్తాంటే, ఈ గవర్నమెంట్ ఏం సాయం చేయలేదా? అంటూ అనుమానంగ ప్రశ్నించాను, చేస్తాందిరా! చేస్తాంది – ఏందో పథకమంట పనికి ఆహారం పథకమంట, ఆ పథకంతో తినేవాళ్ళు తింటున్నారు. మింగే వాళ్ళు మింగుతున్నారు. మేము మాత్రం మన్ను తిని గుటకలు మింగుతున్నాం. ఏం పథకమో, ఏమో, పేరు మాది నోరు వాళ్ళది, ఇదంత అనుకుంటే బాధకల్గతాది గాని పదా ఇంటికి పోదాం. ఎద్దును పట్టుకొని ముందుకు కదిలాడు. మా నాయన నేను కూడ ఏం మాట్లాడకుండ మౌనంగ ఆయప్పెంటే నడుస్తు ముందుకు సాగాను, అలా చేన్లు దాటి ముందుకు పోగానే పదహారు సంవత్సరాల క్రితం నుంచి అసంపూర్తిగ నిల్చిపోయిన కాలువ గట్టుపైకి చేరుకున్నాం. మా ప్రాంత రైతుల ప్రయోజనాలనుద్దేశించి నిర్మింప తలపెట్టిన కాలువ పని పదహారు సంవత్సరాల క్రితం మొదలై నేటిక్కూడా ఆ పనులు పూర్తికాక నేతల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంలా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్లు ఆ పని కాస్త శంకుస్థాపన రాయికాడికే పరిమితం అయింది. అక్కడ వేసిన శంకుస్థాపన రాయి కాస్త సమాధి రాయిలా నిల్చి చూపరులను చక్కగ ఆకట్టుకొంటుంది. అలాంటి నేతల నిర్లక్ష్యంను తిట్టుకుంటు, కరువు బారిన పడి ఆకలితో అల్లాడుతున్న మా వూరి ప్రజల బాధల్ని తల్చుకుంటు మౌనంగ ముందుకు సాగుతున్న నాకు గతం స్వాగతం పలికినట్లు గత జ్ఞాపకాలు స్మృతిలో మెదిలాయి.

☆ ☆ ☆

సరిగ్గా పదహారు సంవత్సరాల క్రితం మేమంత పిల్లతనంలో మావూరి బయటనున్న పెద్ద చింతచెట్టుకాడ కోతికొమ్మచ్చి ఆట ఆడుతుండగా, ఉన్నట్లుండి బడ బడ మనేశబ్దం చేసుకుంటూ వచ్చిందో హెలికాప్టర్ మావూరికి. ఆ హెలికాప్టర్‌ను చూడగానే నాతోటి జతగాళ్ళంత అయ్... అయ్.. విమానం, విమానం అంటు చప్పట్లు చరుస్తు ఆనందంతో గట్టిగా అరుస్తూ, కేకలు వేసుకుంటు ఆ హెలికాప్టర్ దిగిన చోటికి పరిగెత్తినారు. వాళ్ళతో కల్సి నేను కూడ ఆ హెలికాప్టర్ దిగిన చోటికి పరిగెత్తాను. మాకు తోడుగ కొందరు పెద్దవాళ్ళు కూడ గోచీలు బిగగట్టి మావెంటే పరుగెత్తుకొచ్చారు. ఆ వచ్చిన హెలికాప్టర్ నుండి ఎవరో ఒక పెద్ద మనిషి గోచి సవరించుకుంటు గాల్లో చేతులు ఊపుతు బ్యాండు మేళాలతో ఎత్తయిన రాయికాడికి పోయి కొబ్బరి కాయ కొట్టి అదే బ్యాండు మేళాలతో ఒక ఎత్తయిన వేదిక మీదికెక్కి మైకు ముందుకొచ్చి తన గొంతు సవరించుకొని మహాజనులారా! ఈ రోజుఎంతో శుభదినం, ఎందుకనగ, ఈ రోజు నుండి ఈ రోజు నుండి మీ కష్టాలు తీరుతాయి. మీ ప్రాంతంలో పుష్కలమైన పంటలు పండించుటకు, మీ కందరికి తాగునీరు, సాగునీరు అందించుటకు ఈ కాలువను మంజూరు చేశాం. ఈ కాల్వ వల్ల మీ పంటలకు నీళ్ళకు కొదవ లేదు. మీ ప్రాంతంను అన్నపూర్ణగా తీర్చిదిద్దుతాం. మీ రాయలసీమ రతనాల సీమను చేస్తాం, మీ కడగండ్లు తీరుస్తా. మీ కన్నీల్లు తుడుస్తా అంటూ ఏవో భీకర ప్రగల్భాలు పలుకుతున్నాడు ఆయప్ప చెప్పే మాటలకు ఆడికొచ్చినోళ్ళంత గట్టిగ ఈలలువేస్తూ చప్పట్లు చరుస్తూ జిందాబాద్ జిందాబాద్ అంటు దిక్కులు పిక్కటిల్లేలా గట్టిగా అరుస్తాండారు. ఆ అరుపులకు పులకరించి పోయిన ఆ పెద్దాయన మరింత సంబరంతో, ప్రజలారా! ఈకాల్వను నాలుగు సంవత్సరాల్లో పూర్తి చేస్తానని హామీ ఇస్తున్న అంటు గాల్లో చేయి ఊపుతుపోయి హెలికాప్టర్‌లో కూర్చొని గాలిలో దుమ్ము లేపుకుంట ఆ దుమ్ము ప్రజల కంట్లో కొట్టి అక్కడి నుంచి రయ్ అని ఎగిరిపోయారు. ఆయప్ప కాసింత కనుమరుగయ్యాడో లేదో ఆ గుంపులో నుండి ఓ పెద్ద ఆసామి మా నాయన కాడికొచ్చి ఏందప్ప! సూరప్ప!! ఈ కాలువ కింద ఉన్న నీ... భూమి ఇత్తావా చెప్పు, కొంటాను, ఎంతకిత్తావో చెప్పు. ఇక్కడే రేటు తెగిపోని అంటు అక్కడున్న రైతుల చేన్లను బేరమాడతాండాడు. అయ్యప్ప ఆడిన బేరానికి ఆడున్న రైతులంత ఒక్కసారి ఐక్యంగా స్పందించి సరేలేవోయ్ నీ సంబడం. నీకేనా మీ యమ్మగాడిద పాలు పోసింది. మా యమ్మలు కూడా మాకు గాడ్దిపాలు పోసి సాకినారు. తెలివి నీకొక్కడికే కాదు మాక్కూడ ఉంది. చూడూ! ఇంకా ఐదేండ్లకు మా బతుకులెట్లుంటాయో. నీకన్న సావుకార్లమై నీకన్న బాగా సంపాయించకుంటే అప్పుడడుగు. కాల్వ కిందున్న మా శేన్లకు నీళ్ళు పారితే మేము కూడ నిన్ను మించిన మొగోళ్ళమవుతాం. నువ్వేకాదు వోయ్ మేము కూడ దూలం ఎద్దుల్ని

సాకుతాం, జాంతానం ఆడకుండ ఈట్నిండి పో అంటూ ఆదున్న రైతులంత ఆ ఆసామిని దులిపేస్తున్నారు. రాబోయే కాల్వను తల్చుకుంటు మారబోయే తమ బ్రతుకుల్ని ఊహల్లో మల్చుకుంటు అక్కడ్నుంచి ఒక్కొక్కరు సన్నగా జారుకున్నారు.

గత జ్ఞాపకాలను తల్చుకుంటు ముందుకు నడుస్తున్న నా దృష్టి నాకెదురుగున్న నల్లని నిలువెత్తు శిలాఫలకంపై మరలింది. ఆ రాయిపై ఓ కాకి కూకోని కావ్... కావ్ అంటూ అరుస్తున్నది. భర్త కన్నప్ప సిన్మాలో శివలింగం ఏదుస్తు కన్నీళ్ళు పెట్టినట్లు... ఆ నల్లని రాయి, పిట్టలు వేసిన రెట్టలు, చారలతో ఆ రాయంత గబ్బు గబ్బుగా ఉంది. పదహారు సంవత్సరాల క్రింద వేసిన శంకుస్థాపన రాయి నేటికి పదిలంగా ఉంది కాని పనులు మాత్రం ఎంతమాత్రం ముందుకు సాగలేదు. కారణాలు ఏవైనా, మా ప్రాంత రైతులకు జరగవలసిన నష్టం జరిగింది. కాలువ సమస్య పట్టుకొని గద్దెక్కుతున్నారే కాని, ఏ ఒక్కళ్ళు కూడ ఆ కాలువను పూర్తి చేయటానికి ఏ మాత్రం కృషి చేయలేదు. ఆ కాల్వపై ఆశలు పెట్టుకున్న మా ప్రాంత రైతుల ఆశలను అడియాశలు చేసిన నేతల నిర్లక్ష్యంను తిట్టుకుంటు ఉక్రోషంతో పిడికిలి బిగించి ముందుకు నడిచాను. ముందుకు నడుస్తూనే ఉన్నాను గాని నన్ను ఓ మాట పదే పదే వేధిస్తోంది. కరువు కరువు కరువు. ఈ మూడక్షరాల కరువు మా జిల్లాకు పిలవని పేరంటానికి వచ్చినట్లు వచ్చి మా జీవితాలను అతలా కుతలం చేస్తోంది. ఇంకా ఎంతకాలం ఈ కరువు? కరువు పేరు చెప్పి ఓట్లను రాబట్టుకున్న రాజకీయ నేతలకు, కరువు ప్రచారంతో గద్దెనెక్కిన నేతలకు మా జిల్లాలో కొదవలేదు. ప్రతిపార్టీ నేత కరువు పేరు చెప్పి లబ్ధి పొందుతాండాదే గాని, ఏ ఒక్కళ్ళు కూడ చిత్తశుద్ధితో పని చేసి కరువును ఈ జిల్లా నుండి శాశ్వతంగా పారద్రోలడానికి కృషి చేయలేదు. కరువు అనేది రాజకీయ నాయకులకు పదవులనందించే రాజకీయ పట్టుకొమ్మ మాత్రమే. అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడు నోట్లో శని ఉన్నట్లు పసిడి పంటలు పండించే మంచి సారవంతమైన భూములు, బంగారు గనులు, ఖనిజ నిక్షేపాలు ఉన్నా రాజకీయ నేతల స్వార్థ పూరిత ఆలోచన్లలోనే, ఈ జిల్లా కరువు కోరల్లో చిక్కి విలవిలలాడుతాంది. సీమప్రాంత రైతాంగానికి తాగునీరు, సాగునీరు అందించే ఉద్దేశంతో తవ్విన కాలువలు పూర్తి చేసి నీరు పారిస్తే కరువు ఎందుకు వస్తుంది? ఈ జిల్లాకు కరువు రావటం లేదు సీమనేతలే కరువును రప్పిస్తున్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగ, ఆకాశ గంగతో చేన్లు తడవక పాతాళ గంగతో నోళ్ళు తడవక, తాగడానికి గుక్కెడు నీళ్ళు దొరకని ఈ సీమలో ఇంకా ఎన్నాళ్ళీ కరువు కరాళ నృత్యం చేస్తుంది. సీమ ప్రజలు కరువు ఇనుప పాదాల కింద నలిగిపోతాంటే ఇవేవి పట్టని సీమనేతలు పదవుల కోసం మేమంటే మేము అని ముందుకొస్తాండారు. ఇట్లాంటి స్వార్థ పరుల ఏలుబడిలో ఉన్న ఈ సీమ ఎప్పుడు బాగుపడ్తుందో ఏమో? అని మనస్సులో తల్చుకొని మౌనంగా ముందుకు పోతున్నాను. కాల్వగట్లపై నడుస్తున్నానే గాని నాకు మాత్రం శ్మశానంలో నడుస్తున్నట్లు అనిపించింది. ఆ కాలవకు కొంచెం దూరంలో ఓ ఎండిపోయిన చింతచెట్టుకింద ఓ పశువు కళేబరం పడి ఉంది. ఆ కళేబరం చుట్టు కొన్ని రాబందులు చేరి ఆ కళేబరంను చీల్చుక తింటున్నాయి. ఆ చెట్టుపై కొన్ని కాకులు చేరి కావ్... కావ్... అంటు గట్టిగా అరుస్తాన్నాయి. ఆ కాకులకు మరికొంత దూరంలో ఓ కుక్క బౌ బౌ... అంటు గట్టిగ అరుస్తాంది తన పొడవాటి కోరపళ్ళను బయటకు ఇకలబెట్టి కోపంగా ఆ రాబందుల కలి చూస్తాంది. అక్కడ కొస్తున్న ఆ కుక్కను ఆ రాబందులన్ని గుంపుగా కల్సి దూరం తరుముతుండాయి. ఆ గుంపును ఎదుర్కోలేక, ఆ కుక్క తోక ముడ్చుకొని రవ్వంత ముందుకు పరిగెత్తి మళ్ళా ఆటికే వస్తాంది. రాబందులు మాత్రం ఆ కుక్కకు ఏ కొంచెం అవకాశం ఈకుండ, మొత్తం కళేబరంను పుష్టిగా తింటాడాయి. కాకులు మాత్రం చెట్టు కొమ్మ కూకోని కావ్ కావ్మని గట్టిగా అరుస్తాండాయి. గాని ధైర్యం చేసి కిందికి దిగిరాలేదు ఆదున్న పరిస్థితి చూడగానే నాకోమాట గుర్తు కొచ్చింది. శవాలు పడితే తప్ప రాని రాబందులకు, ఎన్నికలొస్తే తప్ప దాని రాజకీయ నాయకులకు తేడా ఏందా అని, బలవంతుల్ని చూసి అరవడమే తప్ప కరవటం చేత కాని కాకులకు మనకు తేడా ఏందని ? ఆ కళేబరం ఉన్న ప్రదేశంను దాటుకొని పల్లెలోకి అడుగుపెట్టగానే ఆ పల్లె రూపురేఖలే మారిపోయిన పరిస్థితి కనిపించింది. ఊరంత నిర్మానుష్యంగా ఉంది. ఊర్లో జనాల సందడి లేదు. అన్ని ఇండ్లకు బీగాలు ఏసినారు. ఊరిమధ్య ఉన్న రాగిమాను కట్ట కింద పిల్లలు, ముసలోళ్ళు తప్ప ఎవ్వరు కూడ అక్కడ లేరు. ఆడ ఏవో కొన్ని ఎర్రజెండాలు కన్పిస్తాండాయి. అక్కడెవరో వ్యక్తి ఆదున్న పిల్లల్కి ముసలోళ్ళకు గంజి కాంచిపోస్తాండాడు, అక్కడ పిల్లలందరు గుంపుగా చేరి సిల్వర్ తట్టలు (పళ్ళాలు) తీస్కోని అయ్యా! మాకు ముందు పోయ్. మాకు ముందుపోయ్ అంటూ దీనంగ అర్థిస్తాన్నారు. ఎండిన డొక్కలతో, చిరిగిన బట్టలతో ఉన్న ఆ పిల్లల్ని చూస్తు ముందుకు నడిచా, సందు తిరిగానో లేదో అంతలోపే అయ్.. చిన్నాయన వచ్చా, చిన్నాయన వచ్చాడంటు మా అన్న పిల్లలిద్దరు నాకెదురెక్కొచ్చి నా చేతిలో సంచీ గుంజుకొని దాన్లో ఉన్న అరటిపండ్లు తీస్కోని మంచం కిందికి చేరుకొని అయ్, పాప చిన్నాయన పండ్లు



తెచ్చినాడే దా, తిందాం అంటు అమాంతంగ ఆ పండ్లు ఆవురావురుమంటు అన్ని పండ్లను ఇద్దరు పిల్లలే తీరిగ్గా తినేసినారు. నారాక తెల్సుకున్న మా అమ్మ కుక్కిమంచంపై నుంచి మెల్లిగాలేచి ఏంరా చిన్నాడా! ఎప్పుడొచ్చినా? బాగుండావా? అంటు ఆప్యాయంగా అడిగింది. ఇప్పుడేనమ్మ వచ్చింది. ఏమ్మా బాగున్నావా? ఎన్నాళ్లైందే నిన్ను చూచి, ఏమ్మా ఇట్లైనావు అంటు అక్కున చేరి ఆప్యాయంగ అడిగినాను. ఏం బాగులేరా! చిన్నాడా! ఇడ్లో ఇట్లున్నాను - చూడు, సావలేక, బతకలేక సస్తూ బ్రతుకుతుండా, బతుకుతూ సస్తాండా, ఎప్పుడు సస్తానో, ఏమో, నేను బతికి అందర్ని సంపక తింటాండా. అంట కళ్‌కళ్‌మని దగ్గుకుంట మంచంపై కూలిపోయింది. అమ్మ ఏం అయిందే నీకు అంటు ఆత్రంగ అడిగా. ఏం లేదురా చిన్నాడా! మీ అమ్మకు పాలిమాలింది. మొన్న డాక్టర్‌కు చూపితే ఏందో టి.బి.అంటు అని చెప్పినాడు. ఇప్పటికే రోగం ముదిరిపోయింది. చూపించే దానికి లెక్కలులేక ఇట్లే బాధలు పడ్తాండాం. ఇప్పటికే రోగం ముదిరిపోయింది. ఇంట్లో పాడి ఆవుల్ని, ఎద్దుల్ని అమ్మేసినాము. ఇంక మిగిలింది ఈ ఎద్దు ఒకటే. దీని జతలో ఉన్న ఎద్దును పామిడి సంతలో అమ్మనీకి తోల్కపోయినాడు ఆ వచ్చే లెక్కతో మీ అమ్మను అనంతపురంకు తీస్కపోయి పెద్ద డాక్టర్‌కు చూపించాలనుకుండాం అంటూ వాస్తవ విషయాల్ని పూసగుచ్చినట్లు చెప్పినాడు మా నాయన. మా నాయన చెబుతున్న మాటలు వినగానే కోపంతో నేను, ఏం నాయనా! ఈడ పరిస్థితి ఇట్లుండే, నాకు ఒక్క మాట కూడ చెప్పకుండా, దాచి పెట్టినారే. నేనేమన్నా చచ్చాననుకున్నారా? ఏంది, అంటు ఒకింత ఆగ్రహంగ అడిగినాను. లేదురా చిన్నాడా! నీకి సంగతి కావాలనే చెప్పలేదురా! నీవా ఆడచిన్న ఉద్యోగం చేస్తాండావు, నీ జీతం నీ బతుక్కే సరిపోతుంది. అట్లాంటప్పుడు నీకీ సంగతులు చెప్పి నీకిబ్బంది పెట్టలేక చెప్పలేదు. మా బాధలేదో మేమే పడ్తాండాము. మొన్న మీ యమ్మ ఒత్తిడి చేస్తుంటే టెలిగ్రాం ఇచ్చాం. కాని, పిలిపించి నిన్ను ఇబ్బంది పెట్టేది మాకు నచ్చదురా! మా బాధలు ఉండేవేగాని ఇడ్లో వచ్చి కాళ్ళు కడుక్కో బువ్వతిందువుగాని అంటు పిలిచి అమ్మా! గౌరమ్మా చిన్నాడు వచ్చినాడు, కాళ్ళకు నీళ్ళు తెచ్చిమ్మా అంటు ఇంట్లో ఉన్న వదినకు గట్టిగా కేకేసి పిల్చాడు. ఆ పిలుపు

(మిగతా 23వ పేజీలో)

వెళ్ళాలంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నిలబడి మూత్రం పోయలేదు. సిటీలో బయటికి వెళితే మగవాళ్ళ మూత్రశాలల్ని ఉపయోగించలేడు. స్త్రీల మూత్రశాలకు వెళ్ళలేడు. బాధితునికి 63 ఏళ్ళు. అయినా అప్పుడప్పుడు భార్యతో దాంపత్య సుఖం పొందేవాడు. ఇప్పుడు అదీ లేకుండా పోయింది. ఒక్కగా నొక్క కొడుకు ఆర్మీలో కెప్టెన్‌గా పని చేస్తూ చనిపోయాడు. మళ్ళీ పిల్లల్ని కనాలనుకున్నా కుదరదు. శస్త్రచికిత్స వల్ల వచ్చిన ఈ నష్టాలను దృష్టిలో పెట్టుకుని ప్రతివాదుల నుంచి పరిహారం ఇప్పించాలని న్యాయమూర్తులకు మొరపెట్టుకున్నాడు వాసన్.

కోర్టు నుంచి ప్రతివాదులకు నోటీసులు ముట్టాయి. నలుగురు ప్రతివాదులు వాసన్ ఫిర్యాదుకు జవాబు దాఖలు చేశారు. డాక్టర్ రాజశేఖర్ ఇచ్చిన రిపోర్టు సరిగానే ఉందని జవాబు చెప్పారు. శిశ్నానికి క్షయవాధి రావటం చాలా అరుదని, క్యాన్సర్ అని రిపోర్టులో ఉంటే దాన్ని ఆంగ్రాలజిస్టు నమ్మాడని తెలిపారు. శిశ్నానికి క్యాన్సర్ సోకిన సందర్భాల్లో శస్త్రచికిత్స ద్వారా దాన్ని తొలగించటమనేది ప్రపంచమంతటా ఉంది. ప్రత్యామ్నాయం రేడియో థెరపీ ద్వారా క్యాన్సర్‌ను తొలగించేందుకు చేసే చికిత్స కొన్ని కేసుల్లో మాత్రమే సాధ్యమవుతుంది. బాధితునికి ఏడేళ్ళ క్రితం నుంచి డయాబెటీస్ ఉంది. ఇలాంటి వారికి పిల్లలను కనేసామర్థ్యం ఉండదు. అదీగాక, క్యాన్సర్ వచ్చినప్పుడు సెక్స్ జీవితం గురించి, పిల్లల్ని కనటం గురించి ఎవ్వరూ ఆలోచించరు. రోగి జీవితాన్ని కాపాడటం గురించే డాక్టర్లు ఆలోచిస్తారు. రిపోర్టులను చూసి, రోగి జబ్బును క్యాన్సర్‌గా నిర్ధారించుకొని శస్త్రచికిత్స చేయటం జరిగింది. కనుక వైద్యుల సేవాలోపం ఏమీ లేదు. వాసన్ ఫిర్యాదును కొట్టెయ్యాలని ప్రతివాదులు కోర్టును ప్రార్థించారు.

రాష్ట్ర వినియోగదారుల ఫోరం సభ్యులు బాధితుడు, నలుగురు ప్రతివాదులు సమర్పించిన అఫిడవిట్లను పరిశీలించారు. వాసన్ పక్షాన నలుగురు వ్యక్తులు సాక్ష్యం చెప్పారు. డాక్టర్లు ప్రమాణ పత్రాలు వేశాక వారిని బాధితుని లాయర్ క్రాస్ చేయలేదు.

ఇరుపక్షాలు వాదించిన విషయాలను వినియోగదారుల కమిషన్ పరిశీలించింది. అనేక వైద్య గ్రంథాలను కమిషన్ సభ్యులు పరిశీలించారు. క్యాన్సర్ రోగాన్ని నిర్ధారించేందుకు 'బయోప్సీ' నిర్వహించాలని వైద్య గ్రంథాలు చెబుతున్నాయి. క్యాన్సర్‌గా అనుమానించే ట్యూమర్ నుంచి చిన్న ముక్క తీసి పాథాలజిస్టు పరీక్షిస్తే క్యాన్సర్ ఉందా లేదా అనేది తెలుస్తుంది. బయోప్సీ నిర్వహించే సౌకర్యాలు, క్యాన్సర్ స్పెషలిస్టులు హైదరాబాద్‌లో ఉన్నారు. వారిని సంప్రదించిన తర్వాతనే శస్త్ర చికిత్స చేస్తే బాగుండేది. అలా చేయకపోవడం సేవా లోపం.

మెడ్విన్ ఆసుపత్రి, ఆంగ్రాలజిస్టులు కలిసి బాధితుని పట్ల సేవా లోపాన్ని ప్రదర్శించారు. తగిన ముందు జాగ్రత్తలు తీసుకోవటంలో అశ్రద్ధ వహించారు. బాధితుని శిశ్నం చివర ఇన్‌ఫెక్షన్ వస్తే 13 సెంటీమీటర్ల పొడవున్న మొత్తం అంగాన్ని తొలగించారు. వృషణాలకు ఇన్‌ఫెక్షన్ గానీ, క్యాన్సర్ గానీ వచ్చిన ఆధారాలేవీ లేకున్నా వాటిని సైతం తీసివేశారు. ఇదంతా న్యాయమూర్తులకు నిర్ధారణ అయింది. కానీ చాలా మంది వైద్యులు తమ ప్రమాణ పత్రాలు కమిషన్ ముందు దాఖలు చేసి ప్రతివాదులు చేసిన పరీక్షలను, శస్త్రచికిత్సను నిర్ధారించారు. వైద్య వృత్తిలో ఉన్న వారిని, అదే వృత్తిలో ఉన్న ఇతరవైద్యులు సమర్థించటం సహజమని కోర్టు భావించి, కోర్టుస్వయంగా డాక్టర్ చంద్రశేఖర్ రావును పిలిపించి సాక్ష్యం తీసుకున్నది. ఆయన సర్జికల్ అంకాలజీ నిపుణుడు. ఆయన వంటి డాక్టర్లు మాత్రమే క్యాన్సర్ తరహా రోగాలను నిర్ధారించి శస్త్ర చికిత్స చేయాలి. బయోప్సీ నిర్వహించకుండా బాధితునికి శస్త్రచికిత్స చేయటం వైద్య విధానాలకు విరుద్ధమని సాక్ష్యం చెప్పారు. చంద్రశేఖర్‌రావు చెప్పిన ఈ విషయాలను కమిషన్ సభ్యులు పూర్తిగా విశ్వసించారు. యూరాలజిస్టు, ఆంగ్రాలజిస్టు పరిహారం చెల్లించాలని, బాధితుని పట్ల అశ్రద్ధగా వ్యవహరించిన మిగతా ప్రతివాదులు కూడా బాధ్యులేనని తీర్పు చెప్పారు. శస్త్రచికిత్స చేసిన ఆంగ్రాలజిస్టు లక్ష రూపాయలు, మిగతా ముగ్గురు ప్రతివాదులు కలిసి రు. 80 వేలు చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు. ఈ తీర్పును ఏఎల్‌డి ఆగస్టు 15, 2002 సంచికలో ప్రచురించారు. ✤

కరువు కోరలు

(20వ పేజీ తరువాయి)

విన్న మా వదిన ఇంట్లో నుండి ఇద్గో మామ వస్తాండా. ఎద్దును గాటికి కట్టేస్తాండా అంటూ ఎద్దును గాటికి కట్టేసి, బయటికి వచ్చి ఏంబీ బాగున్నావా? అంటూ ఆప్యాయంగా అడిగింది మా వదిన. బాగుండా వదిన నువ్వు కూడ బాగుండావా? అంటు వదిన చేతిలో నున్న ప్లాస్టిక్ చెంబు అందుకొని కాళ్ళు కడుక్కొని ఇంట్లోకి పోయాను. అనునిత్యం పశువులతో కళకళలాడ్తూ కనిపించే గాటిపాట్లో ఉన్న ఒకే ఒక ఎద్దును చూస్తుంటే గాటిపాటంత బోసిపోయినట్లు కన్పించింది. వదిన పెట్టిన బువ్వ పళ్ళెం ముందర కూకోని ఇల్లంత ఓసారి పరిశీలనగా చూశా. ఇంట్లో అందరు కన్పడుతున్నారు గాని, నాకెంతో ఇష్టమైన, మా అన్న కూతురు లక్ష్మి నాకు కనిపించలేదు. ఏం వదినా పెద్దపాప లక్ష్మి యాడికి పోయింది? అని అనుమానంగ అడిగాను. ఏం లేదబ్బీ పెద్ద పాప లక్ష్మి పనికి పోయింది అంటు సమాధానమిచ్చింది వదిన. ఆ... పనికి పోయిందా? ఏం పనికి పోయింది? ఎప్పుడొస్తాది? నా చిన్నితల్లిని చూడక ఎన్నాళ్లైందో? పెద్ద మనిషి అయినప్పుడు రావాలనుకొంటి. కానిసెలవు దొరకలేదు. అందుకే రాలేకపోయాను. ఎట్లుంది వదినా నా చిన్ని తల్లి బాగుందా? అయినా నా చిన్ని తల్లిని పనికి పంపడం ఎందుకు? అని ఆత్రంగా అడిగాను. ఏం లేదబ్బీ! మానూర్లో కరువు వచ్చిందని, మనకు తిండి లేదని తెల్సి పాపం ఎవరో దుబాయి సేట్లంట, మనకింత బువ్వ పెట్టే మహానుభావులు మనూరుకొచ్చి పెళ్ళీడుకొచ్చిన ఆడపిల్లలందరికి వాళ్ళ దేశంలో మంచి ఉద్యోగాలు ఇప్పించి మంచి మంచి జీతాలు ఇస్తామంటే పాపను వాళ్ళెంట పంపినాము. వాళ్ళు మన పాపల్ని పిల్చుకపోయేటప్పుడు వాళ్ళ తల్లిదండ్రులకు తలా రెండు వేల రూపాయలు అడ్వాన్స్ ఇచ్చి పిల్చకపోయినారు. ఇప్పటికి వారం అయింది పోయి. మన పాపతో పాటు గొల్ల సంటెన్న బిడ్డా, కురవ తిమ్మప్ప బిడ్డా, తలారి మారెప్ప బిడ్డను కూడ పిల్చకపోయినారు. ఇంకా మిగిలిన అయిదు మంది ఆడపిల్లల్ని రెండు మూడు దినాలకు వచ్చి పిల్చకపోతామన్నారు – అందుకే వాళ్ళు కూడ ఎల్లబారేకి రడిగా ఉన్నారు, అని చెప్పింది వదిన అమాయకంగ. మా వదిన మాటలు వినగానే నాగుండె గుభేల్ మంది. అదిరే గుండెల్ని బలంగ అదిమి పట్టుకొని అదేంటి వదినా! అంత పని చేశారు. మీ బతుకులు కష్టమయ్యాయని పాప బతుకు నాశనం చేసినారా? కరువు కోరల్లో చిక్కుకున్న మీరు మిమ్మల్ని మీరు కాపాడుకోటం కోసం పెళ్ళీడుకొచ్చిన ఆడపిల్లను దుబాయి సేట్ల విషపు కోరల్లోకి బలవంతంగా తోసినారా? అంటు గట్టిగ అరిచి ఏడ్చాను. నేనరిచిన అరుపులకు దడుసుకున్న మా వదిన ఏందబ్బీ! అట్లండావు. ఏం వాళ్ళు మంచోళ్ళు కాదా? అంటు ఆత్రంగ అడిగింది. ఏం చెప్పల్ల వదినా. ఎట్లా చెప్పల్ల. అయిపోయింది అంతా సర్వనాశనం అయిపోయింది. మీరే నా చిన్ని తల్లి బతుకు సర్వనాశనం చేసినారు. మీ చేతులారా నా చిన్నితల్లిని కామాంధులకు అప్పజెప్పినారు. ఇక్కడి జనాల అమాయకత్వంను, అవసరాల్ని ఆసరా చేసుకొని దుబాయి సేట్ల మంట మన దగ్గరకొచ్చి మంచి ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి మాయమాటలతో మనల్ని మభ్యపెట్టి మన ఆడపిల్లల్ని తీస్కపోయి వాళ్ళని ఢిల్లీ, బొంబాయిలల్లో ఉన్న సాని కొంపలకు అమ్ముతారు. వాళ్ళ బతుకుల్ని నాశనం చేస్తాండారు అంటూ ఏడ్చాను. నేనన్న మాటలు విన్న మా అమ్మ ఉలిక్కి పడి అమ్మదేవుడోయ్ ఎంత పని జరిగిందిరా అంటూ గుండెలు బాదుకొని గట్టిగా అరుస్తూ మంచంపై కుప్పకూలింది. వాస్తవ విషయం తెల్సుకున్న మా వదిన బోరున ఏడ్చి ఎంత పని జరిగిందబ్బీ. ఎంత మోసం జరిగింది. ఇంత జరుగుతుంది అనుకోలేదు అంటూ బొటబొట కండ్ల నీళ్ళు కారుస్తూ వెక్కి వెక్కి ఏడిసింది. మా వదిన కంట్లో నీళ్ళను చూడగానే నా ఒంట్లో రక్తం ఉడికింది. బీదప్రజల అమాయకత్వంను ఆసరా చేసుకొన్న బ్రోకర్ గాళ్ళపైన కోపం కట్టలు తెంచుకుంది. ఆగ్రహంతో పిడికిలి బిగించి ముందుకు కదిలాను... నిద్రబోతున్న నా జనాల్ని మేల్కొల్పడానికి... ✤

"ఆ దుస్తులు ఎలా ఉన్నాయంటే...!"

కొండబాబు

ఆ మధ్య వచ్చిన ఒక సినిమాలోని సన్నివేశం ఇది. హీరో మనసులో ఏ భావం కలిగితే దానిని బయటకు వెల్లడి చేస్తాడు. అదేమంటే తనకు హిపోక్రసీ లేదంటాడు. అలాగని ఆ భావాలు సంస్కారవంతంగా ఉంటాయా? అంటే ఉండవు.

చక్కగా అలంకరించుకుని వెళుతున్న ఒక స్త్రీని పట్టుకుని 'రా' అంటాడు. ఎక్కడికి? అంటూ ఆమె విడిపించుకోబోతే... ''నువ్వు అలంకరించుకున్నది ఆకర్షించడానికేగా... మరి నన్నాకర్షించావు... రా" అంటాడు. ఆమె గింజుకుంటుంటే "మరి రెచ్చగొట్టేలాంటి బట్టలు ఎందుకేసుకున్నావు?" అంటాడు. ఇంతకీ ఆ బట్టలు చీరా రవిక. మన సంప్రదాయ దుస్తులే. ఆమె వాటినే నీట్‌గా కట్టుకుంది. ఆ విధంగా హీరోగారిని 'రెచ్చగొట్టింది'.

ఈ ఒక్క సినిమాలోనే కాదు... అనేక సినిమాల్లో నవలల్లో ఇలాంటి సన్నివేశాలుంటాయి. సమాజంలోనూ ఈ తరహా ఆలోచనలు, వ్యాఖ్యానాలు వినిపిస్తుంటాయి.

''అసలు రేప్‌లు ఎక్కువగా జరగడానికి ఆడవాళ్ళేసుకుంటున్న బట్టలే కారణం సుమా" అని ఒకరంటే

''అవునవును.. ట్రాన్స్‌పరెంట్ డ్రస్సులు.. బిగుతు దుస్తులు" అంటూ మరొకరు అనడం వినిపిస్తుంటుంది.

ఇటీవల ఒక ప్రముఖ దేవస్థానం కమిటీ అధికారి కూడా ఇలాంటిదే ఒక ప్రకటన చేశారు. ఈ దేవస్థానం సందర్శనకు వచ్చే వాళ్ళు ముఖ్యంగా మహిళలు సంప్రదాయ దుస్తులే ధరించాలని షరతు పెట్టాలనుకుంటున్నారట. ఎందుకంటే ప్రస్తుతం కొందరు మహిళలు ధరిస్తున్న దుస్తులు భక్తుల మనస్సులను కల్లోల పరుస్తున్నాయట. ఇవే మాటలు ఉపయోగించారు.

చాలా మంది ఇది నిజమేననుకుంటారు. అలా అనుకునే ఇవే మాటలను తమ విలువైన అభిప్రాయాలుగా తామూ అవకాశమున్నప్పుడల్లా వెల్లడిస్తూ ఉంటారు. ఇది ఎంతవరకు నిజమో ఆలోచించాలి.

స్త్రీలు ధరించే దుస్తులు రెచ్చగొట్టడం వల్లే కొందరు పురుషులు అత్యాచారాలకు పాల్పడుతున్నారనడమంటే తమ నేరాన్ని మరొకరిపై ఆపాదించడమే. స్త్రీల డ్రస్సుల వల్లే పురుషుల మనస్సులకు సమస్య వస్తున్నదంటే, మరి పురుషుల డ్రస్సులు స్త్రీలకు

సమస్య కావడం లేదు గదా. అంటే ఇక్కడ 'దృష్టి' దోషం తప్ప మరొకటి కాదు. శతాబ్దాలుగా 'స్త్రీ'ని విలాస వస్తువుగా చిత్రించిన పితృస్వామిక వ్యవస్థ తీరే స్త్రీ ఎలాంటి దుస్తులు ధరించినా మనోవికారం కలిగించే పరిస్థితికి కారణం.

పైన పేర్కొన్న సినిమా సన్నివేశంలో స్త్రీ ధరించింది సంప్రదాయ దుస్తులే. అయినా మనోవికారం 'కలిగించాయి'. దేవస్థానం వారేమో రకరకాల డ్రస్సులు బహుశా ఆధునిక డ్రస్సులు ధరించడం వల్ల భక్తులకు మనోవికారం కలుగుతుంది కాబట్టి సంప్రదాయ దుస్తులే ధరించాలంటున్నారు. సంప్రదాయ దుస్తులు కూడా 'వికారం' కలిగిస్తున్నట్లు మరి సినిమాల్లో చూపారే! ఒకదానికొకటి పొసగదు.

ఇక భక్తులకు వికారం కలిగిస్తున్నారట. ఆ దేవుణ్ణి దర్శించే వారిలో అత్యధికులు స్త్రీలే. మరి వారంతా భక్తులు కారా? ఎక్కడ ఏ అంశాలు పరిశీలించాలన్నా పరిగణనలోకి తీసుకుంటున్నది పితృస్వామిక భావాలనే.

ఇక సినిమాల్లో హీరోయిన్లకు వాడే దుస్తులు జనసామాన్యంలో ఎవరూ ధరించరు. తప్పంటూ పట్టాల్సి వస్తే అలాంటి దుస్తులను ప్రచారం చేస్తున్న, అమ్ముతున్న వ్యాపార సంస్కృతిని, మార్కెట్ వ్యవస్థను.

ఇక నేటి స్పీడు యుగంలో అనేక మంది యువతులు చీరకంటే సౌకర్యంగా ఉండే చూడీదార్లు, ప్యాంటుషర్టులు ధరిస్తున్నారు. వీటినే తప్పు పడుతున్నారు. ఏవి తినాలి? ఎక్కడికి వెళ్ళాలి? ఏవి ధరించాలి? అనే విషయాలు కూడా ఆమె ఇష్టప్రకారం కూడదా? వాస్తవంగా వాతావరణం రీత్యా ఆయా కాలాలు, సందర్భాలరీత్యా ఏవి సౌకర్యవంతంగా ఉండేవయితే.. అవి ధరిస్తారు పురుషులైనా, స్త్రీలైనా. అదే సమయంలో స్త్రీని సరుకుగా మార్చే మార్కెట్ వ్యవస్థ ప్రచారానికి గురయ్యే సందర్భాలూ ఉంటాయి. ఈ సమాజం ఇంకా అలాంటి 'వక్ర' దృష్టితోనే చూసే దుస్థితి ఉన్నందున... ఆ మేరకు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరమూ ఉంది. కొంతవరకు సామాజిక పరిణతిపై కూడా ఇది ఆధారపడి ఉందనుకోవచ్చు.

ఏదేమైనా మహిళల వస్త్ర ధారణలో సైతం తప్పుబట్టే వ్యాఖ్యానాలు, పలుకుబడులు ఏవైనా సరే నిరసించాల్సిందే.

పాఠక స్పందన

తాడెక్కే వాడుంటే.. బాగుంది

సెప్టెంబర్ 15వ తేదీ ఆదివారం అనుబంధంలోని సంపాదకీయం చదివాము. ఎంత వాడైనా తనే గొప్ప అని భమ పడటం సహజం. తాడెక్కే వాడుంటే వాడి తలదన్నే వాడుంటాడని చక్కగా వివరించారు. అలాగే కార్టూన్ కదంబంలో గంగాధర్ కార్టూన్లు మమ్మల్ని కడుపుబ్బ నవ్విస్తున్నాయి. ఈ వారం సంచికలోని పెండింగ్ ఫైళ్ళ కార్టూన్ బాగుంది.

- అమ్మిన వెంకట అమ్మిరాజు, భద్రాచలం

కళ్ళకు కట్టిన రియల్ స్టోరీ

సెప్టెంబర్ 15 సంచికలో తోట్ల మల్సూరు గారి రియల్ స్టోరీ కళ్ళకు కట్టినట్లుంది. ప్రపంచ ఏకఛత్రాధిపత్యం సాధించాలనే దుష్ట తలంపే ఇరాక్‌పై అమెరికా దాడికి కుట్ర. 1991 గల్ఫ్ యుద్ధంలో లాగానే మిత్రులంతా కలిసి వస్తారనే అమెరికా ఆశ అడియాస అయింది. కూరెళ్ళగారి 'బొమ్మలు నేర్చుకుందాం' బొమ్మలు గీయాలనే ఆసక్తి గలవారికి ఎంతో ఉపయోగకరంగా ఉంది.

- పి.ఎస్.రావు, హైదరాబాద్

కళ్ళు తెరిపించిన 'జ్ఞానదంతం'

సెప్టెంబర్ 15వ తేదీ ఆదివారం ప్రజాశక్తిలో ప్రచురించిన 'జ్ఞానం అందించని జ్ఞానదంతం' వ్యాసం చాలా బాగుంది. జ్ఞానదంతం గురించి డాక్టర్‌గారు చాలా చక్కగా వివరించారు. జ్ఞానదంతం వల్ల చాలా జ్ఞానం వస్తుందని భ్రమపడేవాళ్ళు చాలా మంది ఉన్నారు.

- మానస, హైదరాబాద్

ఆసక్తిదాయకమైన ఫీచర్లు అందిస్తున్న ఆదివారం

ఆదివారం అనుబంధంలో వస్తున్న వ్యాసాలు, వైద్య సలహాల శీర్షిక, కథలు, పిల్లలకు ప్రత్యేకంగా కేటాయించిన పేజీలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. మరిన్ని ఆసక్తిదాయక ఫీచర్లు ప్రారంభిస్తారని ఆశిస్తున్నాము.

- వి.ఎస్.పాణి, మహబూబాబాద్

కళాసాహితి బాగుంది

సెప్టెంబర్ 15 ఆదివారం ప్రజాశక్తి అనుబంధంలో కళాసాహితి శీర్షికన ప్రచురించిన జాతీయ స్థాయిలో ఉత్తమ చిత్రాలు గీస్తున్న శశిభూషణ చిత్రకళారంగానికే మకుటం లేని మహారాజు అని చెప్పడంలో ఎంతమాత్రం అతిశయోక్తి లేదనిపిస్తోంది. చిత్రకళారంగానికి ఆయన చేసిన సేవలు మరువరానివి. ఆయన చిత్రించిన పొల్యూషన్ పెయింటింగ్ కళాతపస్వి 2002 అవార్డును ఎంపిక కావడం అభినందనీయం.

- మేడూరి సత్యనారాయణ, తిరువూరు, కృష్ణాజిల్లా

22-9-02

విద్యార్థి, ఉద్యోగార్థుల సమాచార మార్గదర్శి

- పాఠశాల విద్యార్థులకు 'ప్రిపరేషన్' పాఠాలు
- విద్యార్థులకు కొత్త కోర్సుల అడ్మిషన్‌లు
- ఉద్యోగార్థులకు 'ఎంప్లాయ్‌మెంట్ ఆపార్చునిటీస్'
- 'కంప్యూటర్ ఛానెల్'లో ఐ.టి. న్యూస్
- విద్యావేత్త ఐఐటి రామయ్యగారి 'కౌన్సిలింగ్'
- 'వ్యక్తిత్వవికాసం'/మ్యాథ్స్ స్కిల్స్...... ఇలా అందరికీ అవసరమైన సమాచారమందించే ఏకైక విద్యా ఉద్యోగ వారపత్రిక
- అమూల్యమైన ఈసమాచారం అతి స్వల్పధరకే

దీపిక చందా వివరాలు :

సంవత్సర చందా: ఏజెంటు ద్వారా రూ. 150లు, పోస్టుద్వారా రూ. 160 లు

అర్ధసంవత్సర చందా: ఏజెంటు ద్వారా రూ. 80లు, పోస్టుద్వారా రూ. 85 లు

మీ అడ్రసు తెలుపుతూ చందాలను ఎం.ఓ/డి.డి. రూపంలో పంపించగలరు.

మా అడ్రసు : 1-1-298/4, స్ట్రీట్‌నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాద్-20, ఫోన్ : 7665420, 7663761, మేనేజర్ : 7673787, ఫ్యాక్స్ : 763921, **website : www.prajasakti.com, e-mail : prajasakti@hotmail.com**

చందాదారులుగా చేరండి సమాచారం మీముంగిట నిలుస్తుంది

రేపటి వెలుగుల కోసం
మీకై వెలసిన నేస్తం
మహిళా మేలుకో
మన పత్రిక తీసుకో
వాస్తవాన్ని తెలుసుకో
ప్రజల పత్రిక
ప్రజాశక్తి
ప్రజాశక్తి
ప్రజాశక్తి క్యాంపెయిన్‌కు ప్రచార సామాగ్రి సిద్ధమైనది.
కావలసినవారు ఈ క్రింది అడ్రస్సులను సంప్రదించగలరు.
1-1-298/4, స్ట్రీట్ నెం.1,
అశోక్‌నగర్,
హైదరాబాద్-20.
ఫోన్ : 7613505
గవర్నరుపేట,
విజయవాడ-520002.
ఫోన్: 579071.
50-50-28/3,
బాలాజీ హిల్స్,
విశాఖపట్నం-13.
ఫోన్: 534895
ప్లాట్ నెం.16, 17,
ఎ.పి. ఇండస్ట్రియల్ ఎస్టేట్స్,
రేణిగుంట రోడ్, తిరుపతి.
ఫోన్: 71997.
పెన్షన్-టెన్షన్
ఉన్న హక్కులు హరిస్తుంటే
అడుగడుగున వేధిస్తుంటే
ప్రజల పత్రిక
ప్రజాశక్తి
జనజీవన
పోరాటాలకు
అక్షర రూపం